# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 2 మే 2025 | సంపుటి:9 | సంచిక:125 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## యే మోడీ సర్కార్ హై

ఆతంక్‌వాదియోంకో ఛోడ్తే నహీ



2


## రూ. 2.37 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు




2

### అసెంబ్లీ సీట్ల పెంపుపై

# తీర్పు రిజర్వ్



**తెలుగు రాష్ట్రాల్లో శాసనసభ స్థానాల సంఖ్యపై విచారణ ముగించిన సుప్రీం కోర్టు**

**ఢిల్లీ, మే 1:** ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో చెప్పినట్లుగా తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తామంది. 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాలి. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆ పని చేయకుండా కొత్తగా కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడిన జమ్మూకశ్మీర్‌లో మాత్రమే

...మిగతా 2లో

### ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత..

### జనన, మరణ రికార్డులతో ఓటర్ల

# జాబితా లింకు

**మరింత కచ్చితత్వంతో ఓటర్ లిస్ట్ అప్‌డేషన్**

**బూత్ లెవల్ ఆఫీసర్లకు ఐడీ కార్డులు • ఓటరు స్లిప్పుల డిజైన్‌లో మార్పులు**




**ఢిల్లీ, మే 1:** కేంద్ర ప్రభుత్వం నిన్న కులగణనను చేపడతామంటూ సమాజాన్ని ప్రభావితం చేసే కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఇదే కోవలో ప్రజాస్వామ్యాన్ని, దానికి ప్రాణాధారమైన ఎన్నికల వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసే కీలక నిర్ణయాన్ని గురువారం కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంది. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ)

...మిగతా 2లో

### ఆధునిక ఆయుధాల

# మోహరింపు

- **పశ్చిమ సరిహద్దుల్లో ఈడబ్ల్యూలను దింపిన భారత్**
- **గందరగోళానికి గురవనున్న పాక్ విమానాల నేవిగేషన్ వ్యవస్థ**



**ఢిల్లీ, మే 1:** భారత సైన్యం ఎలక్ట్రానిక్ వార్ఫేర్(ఈడబ్ల్యూ) వ్యవస్థలను పశ్చిమ సరిహద్దుల్లో మోహరించింది. ఇవి పాక్ సైన్యం వినియోగించే గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ సంకేతాలను బలంగా అడ్డుకొంటాయి. దీంతో ఆ దేశ సైనిక, పౌర రవాణా విమానాలు వినియోగించే జీపీఎస్, గ్లోనాస్, బైడూస్ నేవిగేషన్ వ్యవస్థలను అడ్డుకొంటుంది. దీంతో పాక్

...మిగతా 2లో



# 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సీఎం

**ఆత్మకూరు:** రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నారంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. రూ.216 కోట్లతో ఈ 11 పార్కులను ప్రభుత్వం పూర్తిచేసింది. దీంతో పాటు మరో 39 ఎంఎస్ఎంఈ పార్కులను రూ.376 కోట్లతో అభివద్ధి చేస్తోంది. పూర్తయిన పార్కులు అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం, డోన్, ఆత్మకూరు , దర్శి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఉన్నాయి. వీటితో పాటు రాంబిల్లిలోని ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌నూ సీఎం ప్రారంభించారు. 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**అమరావతిలో భూముల విలువ పెరిగింది** 2

### 'మంచి దొంగ'..

# వింత పనులు

**కోట్లు కొల్లగొట్టి మరి సేవా కార్యక్రమాలు**



- **చోరీ చేసిన సొమ్ముతో సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు**
- **ఆలయాలకు విరాళాలు, పేదల ఆస్పత్రి ఖర్చులకు సహాయం**
- **తాళాలు వేసి ఉన్న సంపన్నుల ఇళ్లులే అతని టార్గెట్**
- **300కు పైగా కేసుల్లో నిందితుడు.. శివప్రసాద్ అరెస్ట్**



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కర్ణాటకలో వందల కొద్దీ దొంగతనాలకు పాల్పడిన ఓ గజదొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు వెల్లడించిన విషయాలు పోలీసులనే ఆశ్చర్యానికి గురిచేశాయి. చోరీ చేసిన సొమ్ముతో భారీ ఎత్తున సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తేలడం గమనార్హం. ఈ వింత దొంగ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కర్ణాటకకు చెందిన శివప్రసాద్ అలియాస్ మంత్రి శంక్ప 300కు పైగా దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. ఎట్టకేలకు అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడి నుంచి సుమారు రూ. 30 లక్షల విలువ చేసే 412 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు శివప్రసాద్ కోట్ల రూపాయల విలువైన సొత్తును అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే, విచారణలో వెలుగులోకి వచ్చిన మరో కీలక విషయం పోలీసులను నివ్వెరపరిచింది. శివప్రసాద్ తాను దొంగిలించిన డబ్బులో గణనీయమైన భాగాన్ని సేవా కార్యక్రమాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నట్లు తెలిపాడు. ఇలా దానధర్మాలు చేయడం ద్వారా తాను చేసిన పాపాలకు ప్రక్షాళన జరుగుతుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పాడు. ముఖ్యంగా తాళాలు వేసి ఉన్న సంపన్నుల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడని

...మిగతా 2లో

### ఉపాధి హామీ పథకం

# దేశానికి ఒక వరం

## డిప్యూటీ సీఎం పవన్



**మంగళగిరి:** ఉపాధి హామీ పథకం రాష్ట్రం, దేశానికి ఒక వరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్ హాలులో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామికులతో పవన్ కల్యాణ్ ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్రాభివద్ధికి వెన్నెముకగా మారిందన్నారు. సుమారు 75 లక్షల 23 వేల మంది శ్రామికులు సొంత గ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నారని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖలో రూ.10,669 కోట్లు ఖర్చు చేశామన్నారు. కేవలం వేతనాలకే రూ.6,194 కోట్ల వ్యయం అయిందని వివరించారు. మెటీరియల్ కింద రూ.4,023 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

"పల్లె పండుగలో భాగంగా ఇప్పటికి రూ.377.37 కోట్లతో 21,564 గోకులాలు పూర్తి చేశాం. దీని వల్ల ప్రతి రైతుకు నెలకు రూ.4,200 అదనపు ఆదాయం వస్తోంది. రక్తం ధారపోసి పనిచేసేవారు లేకపోతే ఏ నిర్మాణం జరగదు. ఉపాధి కూలీలను ఉపాధి శ్రామికులుగా పిలుద్దాం. మిగతా వత్తుల్లో ఉన్నవారిలాగే ఉపాధి శ్రామికులు కూడా గొప్పవారే. వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల పాల్జేశారు. మద్య నిషేధమంటూ వచ్చి గత ప్రభుత్వం వ్యాపారం చేసింది. మద్యం కుంభకోణానికి పాల్పడి రూ.3,200 కోట్లు

...మిగతా 2లో



### మే డే వేడుకలు..

## 4 కి.మీ. రిక్షా తొక్కిన మంత్రి నిమ్మల

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. కార్మికులతో కలిసి మండుటెండలో నాలుగు కిలోమీటర్లు ఆయన రిక్షా తొక్కారు. అనంతరం శ్రామికులకు టీషర్టులు, టవళ్లు పంపిణీ చేశారు.

## సదివీ..సదివీ.. సచ్చిపోయింది

మార్కుల కోసం బతుకునే పణంగా పెట్టిన చిట్టితల్లి

పదో తరగతిలో టాపర్‌గా వచ్చింది..


కానీ, ప్రాణం పోగొట్టుకుంది

2

### వధువుకిచ్చే బహుమతి

# స్త్రీ ధనమే

**కేరళ హైకోర్టు తీర్పు**






**ఢిల్లీ, మే 1:** వివాహ సమయంలో వధువుకు బహుమతిగా ఇచ్చే బంగారం, నగదును ఆమె ప్రత్యేక ఆస్తి లేక స్త్రీధనం గా పరిగణించాలంటూ కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి. ఎర్నాకుళంలోని కలమస్సేరికి చెందిన ఒక మహిళకు 2010లో వివాహం జరిగింది. ఆ సమయంలో తన కుటుంబం, బంధువుల నుంచి 71 సవర్ల (ఒక సవర అంటే 8 గ్రాములు) బంగారం అందిందని ఆమె వెల్లడించారు. మంగళసూత్రం, ఒక గాజు, చేతికి ఉన్న రెండు ఉంగరాలు మినహా మొత్తం బంగారన్నంతా భద్రపరుస్తామన్న నెపంతో అత్తింటివారే తమ వద్ద దాచిపెట్టుకున్నారని చెప్పారు. అయితే, అదనపు కట్నం కింద తన భర్త అడిగిన రూ.5 లక్షలు ఇవ్వకపోవడంతో తమ బంధం బీటలు వారిందని తెలిపారు. తన తల్లిదండ్రుల ఫిక్స్‌డ్ డిపాజిట్లతో ఆ బంగారాన్ని కొనుగోలు చేసిన విషయాన్ని ఆమె కోర్టులో నిరూపించుకోగలిగారు. వాదోపవాదాలు విన్న కేరళ హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పును వెలువరించింది. విడాకుల ప్రక్రియలో భాగంగా మిగిలినదిపోనూ 59.5 సవర్ల బంగారం లేక దాని ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నగదు చెల్లించాలని ఆమె భర్త కుటుంబాన్ని ఆదేశించింది. అయితే ఆమె బంధువులు పెట్టిన బంగారానికి, పెళ్లి సమయంలో ఇచ్చిన గృహోపకరణాలకు ఆధారాలు చూపలేకపోవడంతో.. ఆ మేరకు ఆమె

...మిగతా 2లో

## మద్యం కుంభకోణంలో దర్యాప్తు ముమ్మరం

**పోలీసుల అదుపులో రాజ్ కెసిరెడ్డి పీఏ**



**విజయవాడ:** ఏపీ మద్యం కుంభకోణం కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డితోపాటు మరో ఇద్దరిని ఇప్పటికే అరెస్టు చేశారు. వారంతా ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా రాజ్ కసిరెడ్డి పీఏ పైలా దిలీప్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం కుంభకోణానికి

...మిగతా 2లో

### నంగనాచి యవ్వారానికి కేరాఫ్ దాయాది దేశం..



### మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌కు

# ఎనలేని భద్రత

**ముష్కర గురువు హఫీజ్ సయీద్‌కు నాలుగింతలు పెంచిన పాక్ ప్రభుత్వం**

**ఇస్లామాబాద్, మే 1:** పహల్గాం దాడి తర్వాత లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాక్ ఆర్మీ నాలుగు రెట్ల భద్రతను పెంచినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి వెనక లష్కరే తోయిబా కుట్ర ఉందనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ దాడి తర్వాత నుంచి లష్కరే చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు పాక్ ప్రభుత్వం అమాంతం భద్రత పెంచడమే ఇందుక్కారణం..! గతంతో పోలిస్తే అతడి భద్రతను నాలుగింతలు పెంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లాహోర్‌లోని అత్యంత రద్దీగా ఉండే నివాస సముదాయాల నడుమ హఫీజ్ సయీద్ నివసిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. అతడి ఇంటి చుట్టూ పాక్ ఆర్మీ, ఐఎస్ఐ, లష్కరే ముఠా నిరంతరం పహారా కాస్తున్నట్లు తాజా సమాచారం. దీంతోపాటు కాంపౌండ్ చుట్టూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా డ్రోన్లతో నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇక, హఫీజ్ ఇంటికి నలువైపులా 4 కిలోమీటర్ల పరిధిలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను అమర్చారనే వార్తలు అందుతున్నాయి.లష్కరే చీఫ్ ఇంటి సమీపంలోకి సామాన్య పౌరులెవరినీ అనుమతించడం లేదని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్మీకి చెందినవి కాకుండా.. ఇతర డ్రోన్లపై నిషేధం

...మిగతా 2లో

## మద్యం కుంభకోణంలో దర్యాప్తు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన కీలక సమాచారం ఆయన వద్ద ఉందని భావిస్తున్నారు.

గత కొన్ని రోజులుగా పోలీసుల ఎదుట హాజరుకాకుండా దిలీప్ తప్పించుకొని తిరుగుతున్నాడు. గురువారం దుబాయ్‌కి పారిపోయేందుకు చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకున్న దిలీప్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్ లొకేషన్ ద్వారా అతడి కదలికలపై నిఘా పెట్టిన సిట్ బందం.. చెన్నై ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు గుర్తించి అక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఇవాళ సాయంత్రం విజయవాడకు తీసుకొచ్చే అవకాశం ఉంది.

**వారం రోజుల సీఐడీ కస్టడీకి రాజ్ కెసిరెడ్డి**

మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డిని సీఐడీ కస్టడీకి అప్పగించేందుకు విజయవాడ కోర్టు అనుమతిచ్చింది. రేపటి నుంచి వారం రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అతడిని విచారించేందుకు అంగీకరించింది. ఈ కేసులో కీలకంగా ఉన్న కసిరెడ్డిని విచారించేందుకు 10 రోజుల కస్టడీకి అప్పగించాలని సీఐడీ పిటిషన్ దాఖలు చేయగా.. వారం రోజులకు న్యాయస్థానం అనుమతిచ్చింది.

## ఉపాధి హామీ పథకం దేశానికి ఒక వరం: డిప్యూటీ సీఎం పవన్

(మొదటి పేజీ తరువాయి)

కొల్లగొట్టారు. వైకాపా ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన పరిస్థితుల్లో పంచాయతీరాజ్ నిధులు రాష్ట్రానికి ప్రాణవాయువు అయ్యాయి'' అని పవన్ కల్యాణ్ వివరించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ శ్రామికులకు ప్రధానమంత్రి జీవిత బీమా కల్పించినట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు. వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల జీవిత బీమా లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే వచ్చే పరిహారాన్ని రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఈ మేరకు పవన్ సమక్షంలో ఎస్‌బీఐతో పంచాయతీరాజ్ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.

## యే మోడీ సర్కార్ హై

**ఢిల్లీ, మే 1:** బైసరన్ లోయలో చోటుచేసుకున్న ఉగ్రదాడిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. 'ఉగ్రవాదాన్ని అంతం చేసేంత వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయం. ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకొని శిక్షిస్తాం. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నాం. దాడి చేసి విజయం సాధించామని అనుకుంటే అది పొరపాటే. ఇది మోదీ సర్కార్. మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు. వెంటాడి వెంటాడి అంతం చేస్తుంది. అమాయకుల చావులకు కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందే' అని అన్నారు.

## సీడబ్ల్యూసీ సమావేశాలు... నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

**హైదరాబాద్,మనం బ్యూరో:** సీడబ్ల్యూసీ సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఇతర ముఖ్య నేతలతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొననున్నారు.

# అమరావతిలో భూముల విలువ పెరిగింది: సీఎం చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

ఆత్మకూరు: దేశంలో అసంఘటిత కార్మికులే అధికమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు అసంఘటిత కార్మికులు అనేక కష్టాలు పడ్డారని చెప్పారు. మేడే సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 11 ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

''ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ.వేలకోట్ల ఆదాయం వస్తుంది. ఆ ఆదాయాన్ని వదులుకుని మరీ.. ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నాం. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం.. నాలా చట్టాన్ని రద్దు చేశాం. కార్మికుల కోసం కర్నూలు, గుంటూరులో వందపడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. ఆంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నాం. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఇచ్చిన భూములను అభివద్ధి చేసి కొంతభాగం వారికి ఇస్తున్నాం. ఆ రైతులను కోటీశ్వరులుగా మారుస్తున్నాం. ఇప్పుడు రాజధానిలో భూముల విలువ పెరిగింది. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తాం. అభివద్ధి జరుగుతుంటే సహించలేనివారు ఉన్నారు'' అని చంద్రబాబు అన్నారు.

# రూ. 2.37 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు

**ఢిల్లీ, మే 1:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఈ మొత్తంగా రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. అంతకుముందు నెలలో (మార్చి) జీఎస్టీ వసూళ్లు 1.96 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 10.7 శాతం మేర పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.46,913 కోట్లకు పెరిగింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

**మొదటి నెలలో రూ. 92 వేల కోట్లు..**

దేశంలో వివిధ రకాల పరోక్ష పన్నుల స్థానే 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. తొలి నెల రూ.92వేల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. ఆరంభంలో ఎదురైన కొన్ని రకాల సవాళ్ల కారణంగా ఆ ఏడాదంతా అదే స్థాయిలో వసూళ్లు నమోదయ్యాయి. 2018 ఏప్రిల్లో తొలిసారి జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల రూపాయలు దాటాయి. కొవిడ్ కారణంగా రెండేళ్ల పాటు వసూళ్లు నెమ్మదించాయి. మళ్లీ 2022 ఏప్రిల్లో రూ.1.67 లక్షల కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. ఆ పై ప్రతి నెలా రూ.1.50 లక్షల కోట్లు పైనే వసూళ్లు నమోదవుతూ వచ్చాయి. తొలిసారి 2024 ఏప్రిల్లో జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు మార్కు దాటింది. సరిగ్గా ఏడాది తర్వాత రికార్డు వసూళ్లు నమోదు కావడం

# ఆధునిక ఆయుధాల మోహరింపు

(మొదటి పేజీ తరువాయి)

సైనిక విమానాలు, డ్రోన్లు, గైడెడ్ మిసైల్స్ భారత్లో లక్ష్యాలను గుర్తించడంలో తీవ్ర గందరగోళానికి గురవుతాయి. ఫలితంగా యుద్ధ రంగంలో ఏం జరుగుతోందో అన్న గందరగోళంలో పాక్ సైన్యం పడిపోతుంది. ఇదే అదునుగా మన సైన్యాలు దాడి చేసి శత్రువును లొంగదీసుకుంటాయి. 2024 సెంటర్ ఫర్ ల్యాండ్ వార్ఫేర్ స్టడీస్ లెక్కల ప్రకారం భారత్ వద్ద ఇలాంటి వ్యవస్థలు దాదాపు 50 వరకు ఉన్నాయి. ఇక వాయుసేన రఫేల్ యుద్ధ విమానాల్లోని స్పెక్ట్రా సూట్స్, నేవీ వినియోగించే శక్తి సిస్టమ్స్ కూడా నేవిగేషన్ సిగ్నళ్లను జామ్ చేయగలవు. పాకిస్థాన్ వద్ద సొంతంగా తయారు చేసుకొన్న ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థలు లేవు. కానీ, చైనా నుంచి దిగుమతి చేసుకొన్న డీడబ్ల్యూఎల్-002, జర్బా కోస్టల్ ఈడబ్ల్యూ సిస్టమ్ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కమర్షియల్ జామర్లను అది వాడుతోంది. ఇక భారత్ చర్యలతో ఈ ప్రాంతంలో నేవిగేషన్తో రోజువారీ చేసే పనుల్లో తీవ్ర అంతరాయం ఏర్పడనుంది. ఏప్రిల్ 22న పహల్గాంలో సందర్శకులపై ఉగ్రదాడి జరిగిన తర్వాత భారత్ తీవ్రస్థాయిలో స్పందించింది. పాక్ తన గగనతలాన్ని మూసివేసింది. మరోవైపు న్యూఢిల్లీ ప్రతిస్పందన ఎలా ఉంటుందో అంచనా వేయలేని పాక్.. తన విమానాలు భారత్ పై నుంచి కాకుండా వేరే మార్గాలకు మళ్లించింది. ఈనేపథ్యంలో భారత్ ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు పాక్ రవాణా, సైనిక, పౌర విమానాలకు నోటీస్ ఎయిర్మన్ (నోటమ్)జారీ చేసింది.

# ఘుస్ కే మారో

## పీవోకేలోకి చొరబడి కొట్టాలె

## కేంద్రానికి ఒవైసీ సూచన



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** పహల్గామ్ ఉగ్రదాడి ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో, మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై తీవ్రంగా స్పందించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి చొరబడి దాడులు చేయటం కాదని, శాశ్వతంగా అక్కడే ఉండిపోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. దాడులకు ప్రతిదాడులు చేయడం కాకుండా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా భారత్ అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) విషయంలో ఒవైసీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను ఇస్లామాబాద్ ఖాళీ చేయిస్తోందన్న వార్తల నేపథ్యంలో ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్తాన్ ఖాళీ చేస్తే, మనం వెళ్లి అక్కడ కూర్చోవాలి. అక్కడే ఉండిపోవాలి. ఈసారి చర్యలు తీసుకుంటే, ఇంట్లోకి చొరబడి అక్కడే తిష్ఠ వేయాలి. అంతటితో ముగించాలి' అని ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ పేర్కొన్నారు. కేవలం దాడులు చేసి వెనక్కి రావడం కాదని, పీవోకేలో స్థిరంగా ఉండాలని ఒవైసీ అభిప్రాయపడ్డారు.పీవోకే భారతదేశంలో అంతర్భాగమని భారత పార్లమెంట్ తీర్మానం చేసిందని ఒవైసీ గుర్తు చేశారు. 'బీజేపీ నేతలు 'ఘర్ మే ఘుస్ కే మారేంగే' (ఇంట్లోకి చొరబడి కొడతాం) అంటారు. నేను 'ఘర్ మే ఘుస్ కే బైఠ్ జావో' (ఇంట్లోకి చొరబడి కూర్చోండి) అంటున్నాను. ఈ ఉగ్రవాదానికి ఇక ముగింపు పలకాలి'అని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని లుంబినీ పార్క్, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లతో పాటు ముంబై 26/11, పుల్వామా, ఉరి, పఠాన్‌కోట్, రియాసీ దాడులను ప్రస్తావిస్తూ, ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, దీనిని ఇక ఆపాలని అన్ని ప్రతిపక్షాలు ప్రభుత్వానికి చెబుతున్నాయని అన్నారు.

# 'మంచి దొంగ'.. వింత పనులు

(మొదటి పేజీ తరువాయి)

విచారణలో వెల్లడైంది. ఆధారాలు దొరక్కుండా, వేలిముద్రలు పడకుండా ఉండేందుకు శివప్రసాద్ ఓ వినూత్న పద్ధతిని అనుసరించేవాడని పోలీసులు గుర్తించారు.

చేతి వేళ్లకు ఫెవికాల్ పూసుకుని చోరీలు చేయడమే అతని ప్రత్యేకత అని వివరించారు. తాను దోచుకున్న సొమ్ములోంచి మహారాష్ట్రలోని ఓ ప్రముఖ ఆలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం అందించినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, పలు దేవాలయాలకు బంగారు కానుకలు సమర్పించడం, పేదల ఆసుపత్రి



ఖర్చులను భరించడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు విచారణలో తేలింది.

## అసెంబ్లీ సీట్ల పెంపుపై

# తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ సీట్లను పునర్విభజించింది. ఇది పూర్తి అహేతుకం, రాజ్యాంగ విరుద్ధం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమల్లోకి వచ్చిన ఐదేళ్ల తర్వాతే జమ్మూకశ్మీర్లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేశారు' అని పిటిషనర్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజన్ వాదిస్తూ.. 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటే 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల వరకు వేచి చూడాలి. జమ్మూకశ్మీర్ పునర్విభజన వేరు.. అది కేంద్రపాలిత ప్రాంతం కిందికి వస్తుంది' అని పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్ న్యాయవాది విభేదించారు. డీలిమిటేషన్ కు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్న తేడా ఉండదన్నారు. ''డీలిమిటేషన్ పై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య చాలా వివాదం నడుస్తోంది. ఈ ప్రక్రియపై పూర్తి అయోమయం నెలకొంది. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ కోసం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసినా అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను చేర్చలేదు. 2026 తర్వాతైనా నియోజకవర్గాల పునర్విభన చేపడతారా? అన్నదానికి స్పష్టమైన సమాధానం లేదు' అని తెలిపారు. తర్వాత అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ వాదనలు వినిపిస్తూ.. 2026 తర్వాత నిర్వహించే తొలి జనాభా లెక్కల వివరాలను ప్రచురించేంత వరకూ దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సిన అవసరం లేదని ఆర్టికల్ 82లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చినట్లు చెప్పారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ సూర్యకాంత్ తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

## మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌కు ఎనలేని భద్రత



(మొదటి పేజీ తరువాయి)

విధించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా.. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం హఫీజ్ సయీదేనని భారత నిఘా వర్గాలు ఇప్పటికే అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అతడిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరగొచ్చన్న అంచనాలతో లష్కరే చీఫ్‌కు పాక్ భద్రత పెంచడం గమనార్హం. గతంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ పాక్‌లో అబోట్టాబాద్‌లోని ఓ రహస్య ప్రాంతంలో తలదాచుకున్నాడు. అది జనావాసాలకు దూరంగా ఉండటంతో అమెరికా దాడులు చేసేందుకు సులువైంది. ఇక మసూద్ అజార్ వంటి ఉగ్రనేతలు కూడా బవహల్పూర్ పర్వతాల్లో దాక్కొని అక్కడినుంచే కార్యకలాపాలను సాగిస్తున్నారు.

కానీ, వారికి భిన్నంగా హఫీజ్ సయీద్ జనావాసాల మధ్య ఉంటున్నాడు. దీంతో సామాన్య పౌరులకు నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో దాడులకు వెనకడుగు వేయొచ్చనేది పాక్ కుటిల యోచనగా తెలుస్తోంది.

## వధువుకిచ్చే బహుమతి స్త్రీ ధనమే

(మొదటి పేజీ తరువాయి)

చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అయితే ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'వివాహ సమయంలో వధువుకు వచ్చే బంగారాన్ని భద్రపరుస్తామనే ముసుగులో లేక ఆచారాల్లో భాగంగా భర్త లేక అతని కుటుంబం తమ వద్ద ఉంచుకుంటుంది. ఇలాంటి బదిలీల విషయంలో రాతపూర్వకంగా ఎలాంటి రికార్డు ఉండకపోవడంతో దానిని ఆమె తిరిగి తీసుకునే అవకాశాలు పరిమితమే. గృహహింస, వరకట్న వేధింపులు లేక విడాకుల వంటి పరిస్థితి తలెత్తినప్పుడు దానిని వెనక్కి తీసుకోవడం మరింత సమస్యాత్మకంగా మారొచ్చు. ఆమె బంగారాన్ని అత్తింటివారికి ఇచ్చినప్పుడు రసీదులు వంటివి ఉండకపోవడం వల్ల అది తనదే అని ఆమె నిరూపించుకోవడం కష్టంగా మారుతుంది. న్యాయస్థానాలు ఈ పరిస్థితిని పరిగణనలోకి



తీసుకోవాలి. క్రిమినల్ కేసుల్లో మాదిరిగా చట్టపరమైన సాక్ష్యాలు కావాలని ఒత్తిడి చేయలేం' అని కేరళ హైకోర్టు వ్యాఖ్యానించింది.

# తెలుగులో రాస్తే మార్కులెందుకు తగ్గుతయ్?

**టీజీపీఎస్సీని ప్రశ్నించిన హైకోర్టు**

**హైదరాబాద్, మే 1:** తమిళనాడులో ప్రజలకు ఎన్ని భాషలు వచ్చినా తమిళంలోనే మాట్లాడతారు. ఇక్కడేమో ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారు. ఇది నా స్వీయ అనుభవం కూడా. తెలుగులో గ్రూప్-1 పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నది ప్రధాన ఆరోపణ. దీనికి కారణమేమిటో స్పష్టత ఇవ్వాలి. మెయిన్స్ మూల్యాంకనంలో అనుసరించే ప్రాతిపదిక, మార్కుల కేటాయింపు విధానంపై వివరణ ఇవ్వాలి'' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారం టీజీపీఎస్సీని ఆదేశించారు. గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన నాలుగు పిటిషన్లపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు మాట్లాడుతూ... ''మూల్యాంకనం కోసం కేటాయించిన వారిలో ఎందరికి తెలుగులో ప్రావీణ్యముంది? వారికేమైనా జవాబుపత్రాలను ఇస్తారా? మెయిన్స్లో మార్కులు



కేటాయించడానికి ఏదైనా 'కీ' ఉందా? ఒక ప్రశ్నకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, ఉర్దూల్లో రాసిన వారికి ఏ ప్రాతిపదికన మార్కులను కేటాయిస్తారు. తెలుగులో వాస్తవ, స్వేచ్ఛానువాదం అనే రెండు రకాల అనువాదాలు ఉంటాయి. అలాంటప్పుడు వీటికి ఏ ప్రాతిపదికన మార్కులు కేటాయిస్తారు? మొత్తం అర్థుల్లో తెలుగులో రాసి, ఎంపికైన వారి వివరాలుంటే ఇవ్వండి'' అని టీజీపీఎస్సీ న్యాయవాదికి సూచించారు. దీనిపై టీజీపీఎస్సీ న్యాయవాది పి.ఎస్.రాజశేఖర్ స్పందిస్తూ... ''ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు ఉంటాయి.

అందుకే దీనికి ఎలాంటి కీ ఉండదు. వివరణాత్మక ప్రశ్నలైనందున ఆయా సబ్జెక్టుల్లో నిపుణులనే మూల్యాంకనం నిమిత్తం నియమిస్తాం'' అని వివరించారు. ఈ సందర్భంగా మూల్యాంకనం చేసిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని పిటిషనర్ల తరపు న్యాయవాదులు చెప్పడంతో టీజీపీఎస్సీ న్యాయవాది స్పందిస్తూ... ''దీనిపైనా పిటిషనర్లు స్పష్టతివ్వాలి. విద్యాశాఖ కమిషనర్కు, టీజీపీఎస్సీకి మధ్య మాత్రమే జరిగిన సమాచారం పిటిషనర్లకు ఎలా తెలిసిందన్న దానిపై విచారణ జరిపించాలంటూ పోలీసులను కోరాల్సి ఉంది. మూల్యాంకనం చేసినవారి పేర్లు బయటికి రావడం, వారిని కోర్టులకు ఈడుస్తుండటంతో... ఇకపై వారు ఆయా విధులకు రావాలంటే భయపడతారు'' అని ఆందోళన వ్యక్తంచేశారు.

## కులగణన చారిత్రాత్మక నిర్ణయం

**మనం బ్యూరో, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. గురువారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న 60 ఏళ్లలో ఎప్పుడూ ఇలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. 1931లో చివరిసారి బ్రిటీష్ ప్రభుత్వం కుల గణన చేసింది అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ ఎందుకు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, దేశ సమగ్ర ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దోహదం చేస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**కుల గణన సర్వేతో లక్ష్యబద్ధంగా అభివృద్ధి : పెరిక సురేష్**

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ సోషల్ మీడియా సభ్యుడు పెరిక సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయం దేశంలోని వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యా స్థితిగతులను కచ్చితంగా అంచనా వేయడానికి దోహదం చేస్తుందన్నారు.

# సదివీ..సదివీ.. సచ్చిపోయింది

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఇటీవల ఓ రెండు రోజుల క్రితం తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో ఓ బాలిక స్కూల్ టాపర్‌గా నిలిచింది. కష్టపడి చదివి, పది ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ వచ్చింది. అయితే, ఆమెను విధి వెక్కిరించింది. ఆ ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి ఆమెను లేకుండా చేసింది. ఎందుకంటే పరీక్షలు పూర్తయిన 13 రోజులకు ఆమె తిరిగిరాని లోకాలకు వెళ్లింది. ఈ విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకుంది.

**అసలేం జరిగిందంటే..**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల రవి, రజిత దంపతుల కూతురు ఆకుల నాగచైతన్య అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగిన పరీక్షలకు ఉత్సాహంగా హాజరైంది. అలా పరీక్షలు పూర్తయిన 13 రోజులకు ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైంది. చివరికి ఆరోగ్యం క్షీణించి పరిస్థితి విషమించడంతో ఏప్రిల్ 17న చనిపోయింది. అయితే, మొన్న విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఆమె 600 మార్కులకు గాను 510 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ సాధించింది. కానీ, ఆ సంతోషాన్ని పంచుకునేందుకు కూతురే లేకపోవడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

# తిరుపతి నగరంలో ఘనంగా మేడే వేడుకలు

- ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే దేశానికి భద్రత ఉండదు
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

**తిరుపతి, మే 1 మనం న్యూస్ :** దేశంలో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే దేశానికి భద్రత ఉండదని కార్మికులకు హక్కులు కోల్పోతారని అందుకోసమే కార్మిక హక్కుల భద్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాధ రెడ్డి పిలుపునిచ్చారు గురువారం 139 వ మే డే జన్మదిన సందర్భంగా తిరుపతి నగరంలో అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 142 ప్రాంతాల్లో జెండాలను ఎగురవేసి ఘనంగా మేడే ఉత్సవాలను సంబరాలను కోలాహలంగా జరుపుకున్నారు తిరుపతి నగరంలో తిరుపతి రుయా హాస్పిటల్ ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ , సిపిఐ జిల్లా కార్యాలయం నందు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాధ రెడ్డి జెండాలను ఎగురవేశారు టాక్సీ యూనియన్ నాలుగు సెంటర్లలో మరియు ఆటో యూనియన్ 57 సెంటర్లలో కే రాధాకృష్ణ ఎన్ శివ ఎం వెంకటేష్ ఎన్ డి రవి సురేష్ ఏపీ బాల ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేశారు మున్సిపాలిటీ యూనియన్ ఆధ్వర్యంలో 27 సెంటర్లలో బి తులసింద్ర దొరస్వామి మధురమోహన్ వంశీ ప్రదీప్ ఉమాపతి ఆధ్వర్యంలో జెండాలు ఎగరవేశారు గాంధీ పురం ఓటేరు గంగరిద్దుల కాలనీలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు జెండాలను ఎగురవేశారు సమతా నగర్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య జండా ఎగరవేశారు లీలామహల్ సర్కిల్ లోనే వీధి విక్రయదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండాను సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ సిహెచ్ శివకుమార్ ఎగరవేశారు వీధి విక్రయ దారుల సంఘం 12 సెంటర్లలో ఎన్డీ రవి సిహెచ్ శివకుమార్ శ్రీనివాసులు బాలాజీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 22 సెంటర్లలో జే విశ్వనాథ్ ఎన్డి రవి కుమార్ గోవింద్ స్వామి ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 4 సెంటర్లలో మహేంద్ర గిరి నాయుడు, ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. తిరుపతి బాలాజీ కాలనీలోనే ఇంద్రానగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన ఏఐటిసి కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి ప్రారంభోత్సవం చేయగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ జెండా ఆవిష్కరణ చేసి చేశారు అనంతరం బాలాజీ కాలనీ నుండి కృష్ణాపురం వరకు భారీ సంఖ్యలో జండాలను చేతబట్టి డప్పుల చెప్పులతో కార్మిక హక్కులు కాపాడుకోవాలని నినాదాలతో ఉత్సాహంగా ప్రదర్శన జరిగింది కృష్ణా పురం ఠాణా సర్కిల్లో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 400 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం వైకుంఠపురం ఆర్చి వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ శ్రీరాముల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండాను హరినాథ్ రెడ్డి ఆవిష్కరించి 300 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు చట్టబద్ధమైన ఎనిమిది గంటల పని దినం సాధించుకోవడంలో కార్మికుల పోరాటాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు ఇప్పుడు మారినటువంటి పరిస్థితులలో ఈరోజు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని పెరిగినటువంటి ఈ పరిస్థితుల్లో పని భారం తగ్గించి మన వేతనాలు మన జీవన పరిస్థితులు మెరుగు పరచాల్సిన ప్రభుత్వాలు కార్మికులకు పట్ల చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో 12 గంటల పని విధానం తిరిగి తీసుకొచ్చి చట్టబద్ధం చేయాలని ప్రయత్నిస్తున్నారని కొంతమంది పెట్టుబడిదారులైతే కార్మికులు ఎక్కువ కాలం పని చేయకపోతే దేశం అభివృద్ధి జరగదని ఉత్పత్తి రాదని చెప్తే ఇంకొక ఆయన ఇంట్లో ఉండి పెళ్ళాం మొఖం చూసుకుంటూ ఉంటారా వచ్చే కార్మికులుగా ఫ్యాక్టరీలలో పనిచేయుటని మాట్లాడుతున్నారు. పెట్టుబడిదారులు డబ్బుండే వాళ్ళు భార్యా పిల్లలతో విలాసవంతమైన జీవితం గడుపుతుంటే కార్మికులు మాత్రం పని ప్రదేశాలలో ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా పనిచేసి మగ్గి మగ్గి చావాలని కోరుకుంటున్నారని ఆయన ఆవేదన చెందారు. 1886కు ముందు పరిస్థితులు మళ్లీ పునరావతం కావాలనే ప్రయత్నం జరుగుతున్నదని దీనిపై కార్మికులు కన్నెర్ర చేయకపోతే తీవ్రమైనటువంటి నష్టం జరుగుతుందని మండిపడ్డారు ఒకపక్క దేశంలో అసంఘటిత రంగ కార్మికులు మనలాంటి వాళ్ళు పెరిగిపోతూ ఉన్నారు వీరందరికీ పని భద్రత కల్పించాలని ఒక చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని పోరాటం చేస్తుంటే ఉన్న చట్టాలను తీసేసి ఈరోజు బిజెపి ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా చేస్తా ఉన్నదన్నారు ఈ మేడే సందర్భంగా ఆధ్వర్యంలో కార్మిక హక్కులు కాపాడడం కోసం ఈ దేశ ఆర్థిక స్వాతంత్రాన్ని కాపాడడం కోసం భద్రత కోసం రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి ఉద్యమించాలన్నారు ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ఈ మేడే సందర్భంగా కార్మిక వర్గం ప్రతిని దేశ లౌకిక వ్యవస్థను కాపాడుకుంటామని కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కుల తో పాటు దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని సైతం పూర్తిగా నాశనం చేయాలని కార్పొరేట్లకు ఊడిగం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు దేశంలో నిరుద్యోగం పెరిగిపోయి అరాచకాలు అక్రమాలు పెరుగుతున్నాయని వీటిని పెంచి పోషించడానికి ప్రభుత్వాలు ఉన్నాయి తప్ప వాటిని నివారించడానికి మాత్రం ఏ మాత్రం చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు కార్మికులకు ఉన్న హక్కులను భద్రతను కల్పించాలని అసంఘటితరంగా కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సూపరెండింటు, ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ సూపర్డెంట్ పార్థసారధి రెడ్డి , తులసి ఆంధ్ర.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ ఏఐటియుసి నగర కార్యదర్శి ఎన్ డి రవి కే వై రాజా, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉదయ్ కుమార్. కే పద్మనాభరెడ్డి ఎన్ శివ సి హెచ్ శివ కుమార్, బాబు దొరస్వామి శ్రీనివాసులు. వెంకటేష్మ. మహేంద్ర.. నరసింహులు ఏపీ బాల , కిషోర్. రైల్వే బాల ఎల్కే నాయుడు సురేషు అల్లాబక్షు . బాలాజీ హరిబాబు గిరిబాబు సురేషు. పార్వతి. అన్ని వర్గాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కార్మిక హక్కులను రక్షించుకుందాం

- పని గంటలను కాపాడుకుందాం
- 'మే' దినోత్సవ సభలలో కందారపు మురళి

**తిరుపతి, మే 1 మనం న్యూస్ :** కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులకు రక్షణ లేకుండా పోయిందని, 8 గంటల పని విధానాన్ని కాపాడుకోవడమే నేటి మే 'డే' కర్తవ్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. కార్మిక హక్కుల దినోత్సవం మే 'డే' ని తిరుపతి జిల్లాలోని పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. గురువారం నాటి ఉదయం సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు మునిరాజ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నేత ఎస్. జయచంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి కందారపు మురళి ప్రసంగిస్తూ 139 వ మే డే ను కార్మిక వర్గం దేశవ్యాప్తంగా దీక్షా దినంగా జరుపుకుంటున్నదని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లుగా మార్చిందని గుర్తు చేశారు. లేబర్ కోడ్ లు పార్లమెంటులో ఆమోదం పొందటానికి వైసిపి, టిడిపిలు మద్దతు ప్రకటించిన అంశాన్ని మురళి గుర్తు చేశారు. దేశంలోని కార్మిక వర్గానికి వైసీపీ టిడిపిలు బిజెపితో కలిసి ద్రోహం చేశాయని అన్నారు. 139 ఏళ్ల కిందట పని గంటల కోసం కార్మిక వర్గం సాగించిన పోరాటం, వారు చేసిన బలిదానాలు, త్యాగాలను అపహాస్యం చేసే రీతిలో మోడీ ప్రభుత్వం 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చిందని మురళి అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఆధ్వర్యంలో, రైతు సంఘాల మద్దతుతో సమ్మె జరగనుందని తిరుపతి జిల్లాలోని యావత్ కార్మిక వర్గం మరియు రైతాంగం ఈ సమ్మెలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లాలోని పలు పరిశ్రమలలో, తిరుపతి నగరంతో పాటు సమీప మండలాలలో పెద్ద ఎత్తున బిల్డింగ్ నిర్మాణాలు సాగుతున్నాయని, లక్షలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారని, ఇటీవల కాలంలో ప్రమాదాలు పెద్ద ఎత్తున పెరిగాయని అటు పరిశ్రమలలోనూ, ఇటు బిల్డింగ్ రంగంలోనూ ప్రమాదాల కారణంగా కార్మికులు చనిపోతున్నారని వారి కుటుంబాలు వీధుల పాలవుతున్నాయని కందారపు మురళి అన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం, స్విమ్స్, ఆయుర్వేదం, మెటర్నరీ, యూనివర్సిటీలు వంటి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అతి తక్కువ వేతనాలతో కాంట్రాక్టు విధానం పేరిట కార్మికులతో పనిచేయించుకోవడం దారుణమని వివరించారు. కార్మిక హక్కుల పరిరక్షణకై దేశంలో మరో స్వాతంత్ర పోరాటం సాగాల్సిన అవసరం ఆవశ్యకత ఉందని కందారపు మురళి తన ప్రసంగంలో పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయం తో పాటు, రుయా ఆసుపత్రి, స్విమ్స్, బర్డు, యూనివర్సిటీలు, ఆటో స్టాండ్ లు, బిల్డింగ్ కార్మికుల కేంద్రాలు హాకర్స్ సెంటర్లలో సిఐటియు పతాకాలను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మే 20 తేదీన జరిగే సమ్మె పుస్తకాలను ఆవిష్కరిస్తూ మేడే ప్రతిజ్ఞను కార్మికులు చేశారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా, నగర నేతలు టి సుబ్రమణ్యం, వేణుగోపాల్, మాధవ్, సాయి లక్ష్మి, అవనిగడ్డ పద్మజ, రఫీ, లక్ష్మీనారాయణ, రెడ్డప్ప, వి ఎస్ మణ్యం, ఎన్ డి శ్రీనివాసులు, చిన్నా, బుజ్జి, బాలాజీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఏపీ పుణ్యక్షేత్రాల్లో భద్రతా లోపాలపై కేంద్ర హోం మంత్రికి ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు

**తిరుపతి, మే 1 మనం న్యూస్ :** రాష్ట్రంలోని ముఖ్యమైన దేవాలయాల్లో పరిపాలనా లోపాలు, తరచూ జరుగుతున్న భద్రతా వైఫల్యాలపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డా.మద్దిల గురుమూర్తి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి మరోసారి లేఖ రాశారు. విశాఖపట్నం జిల్లా సింహాచలం దేవాలయంలో చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్చి ఆయనకి ఈ లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. గోడ నిర్మాణంలో సరైన ఇంజనీరింగ్ పద్ధతులు పాటించక పోవడం, నాణ్యత లేని మెటీరియల్ ఉపయోగించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎంపీ ఈ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలలో ఇటీవల జరిగిన సంఘటనలని ఈ లేఖ ద్వారా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని శ్రీ కూర్మనాథ స్వామి ఆలయంలో భక్తులు పవిత్రంగా బావించే అరుదైన నక్షత్ర తాబేళ్లు అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం, పోస్టుమార్టం చేయకుండానే వీటి దహనం చేయడం చట్టాలను, సంప్రదాయాలను ఉల్లంఘించడమే అని తెలిపారు.



తిరుమలలో భద్రతా వ్యవస్థ పూర్తిగా తలకిందులైందని, జనవరి 8న వైకుంఠ ద్వార దర్శన కౌంటర్ల క్యూ లైన్లలో జరిగిన దురదృష్టకరమైన తొక్కిసలాట తర్వాత కూడా టీటీడీ పరిపాలనలో ఎలాంటి మార్పు రాకపోవడం బాధాకరం అన్నారు. ఇటీవల కాలంలో మూడంచెల భద్రతా వ్యవస్థను దాటి ఒక భక్తుడు పాదరక్షలతో సింహ ద్వారం వరకు వెళ్లడం వ్యవస్థలోని లోపాలు కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయని తెలిపారు. అలాగే టిటిడి గోశాలలో 100 కంటే ఎక్కువ గోవులు మరణించిన ఘటన గురించి ప్రస్థావిస్తూ గోశాల నిర్వహణలో నిర్లక్ష్యం, గోవులకి నాణ్యతలేని దాణా అందించడం, వైద్య సేవల లోపం, అజాగ్రత్త వెరసి గోవుల మరణానికి కారణమయ్యాయని ఇవన్నీ కూడా పాలనా విఫలమయింది అనేందుకు నిదర్శనాలని ఈ లేఖ లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భద్రతా వైఫల్యాలపై వెంటనే ప్రత్యేక విచారణకు ఆదేశించాలని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి విజ్ఞప్తి చేశారు. భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు, భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని ఎంపీ కోరారు. భారత దేశం యొక్క ఆధ్యాత్మిక వారసత్వాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి తెలియజేశారు.

# రాజధాని నిర్మాణంతో బావితరాలకు బంగారు భవిష్యత్తు

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు**

**కుప్పం, మే 1 మనం న్యూస్ :** వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0 కు శ్రీకారం చుట్టింది అని మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు.65 వేల కోట్లతో 217 స్క్వేర్ కిలోమీటర్లతో 8 వేల 3వందల 52 స్క్వేర్ కి.మీ విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతుంది.అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుంది.అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి.రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి 15 వేల కోట్ల రుణం మంజూరైంది. జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టారు.గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో 4,400 కోట్లు నిధులు మంజూరు చేసింది. మొత్తం 15,400 కోట్లు అమరావతి నిర్మాణానికి హడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయం.ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుంది.అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సినవసరం లేదు.ప్రభుత్వ ఆదీనంలో ఉన్న భూమిని దశలవారీగా అమ్ముతూ రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీలతో సహా చెల్లించవచ్చు. మిగిలిన డబ్బుని 175 నియోజకవర్గాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.రాజధానిలో నిర్మాణాలు అన్నీ పోగా మిగిలిన రూ. 2 లక్షల కోట్ల పైబడి విలువైన మిగులు భూములు అమరావతిలో ఉన్నాయి. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూములు విలువ ఎకరం 50 కోట్లకు పైగా పెరుగుతుంది.



**రాజధాని అమరావతిలో నిర్మాణాలు**

అమరావతిలో ప్రభుత్వం నిర్మించే హౌసింగ్ ప్రాజెక్టుల్లో రూఫ్ టాప్ సోలార్ పవర్ సిస్టమ్స్ నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.అమరావతిలో నిర్మించబోయే గవర్నమెంట్ కాంప్లెక్స్, ప్రభుత్వం కార్యాలయాలు గ్రీన్ బిల్డింగ్ స్టాండర్స్ కు తగిన విధంగా ఉంటాయని ప్రభుత్వం స్పష్ట చేసింది.అమరావతి టౌన్ ప్లానింగ్ అధికారులు అమరావతి పరిధిలో 415 కెడ్యూ రూఫ్టాప్ సోలార్ ప్యానల్స్ ను 16 అంగన్ వాడీ సెంటర్లు, 14 ఈ- హెల్త్ సెంటర్లు, 13 పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశారు.

# పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికే పెన్షన్లు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, మే 1 మనం న్యూస్ :** పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఉదయం కొర్లగుంట సంజయ్ గాంధీ కాలనీలోని రామాలయం వద్ద 8,9 డివిజన్లకు సంబంధించిన లబ్దిదారుల ఇంటింటికి వెళ్ళి పెన్షను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పెన్షన్ ఇచ్చి మాట నిలుపుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకే దక్కిందని అన్నారు. తిరుపతిలో 18,666 మంది పెన్షనర్స్ కు ఎనిమిది కోట్ల ఇరవై లక్షల పదకొండు వేల ఐదు వందల రూపాయలు అందించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో రెండు వేల నుంచి మూడు వేలు పెంచడానికి ఐదేళ్ళు పట్టిందని ఆయన విమర్శించారు. బటన్ నొక్కుడు పేరుతో సగం మందికి పెన్షన్లను ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. పేదలందరికి ఆర్థిక తోడ్పాటు అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలలో ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తనిఖీ..

- వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్న అధికారులు..

**తిరుమల, మే 1 మనం న్యూస్ :** ఆర్టీవో అధికారులు, తిరుమల ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీలు చేశారు. తిరుమలకు రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతుంది. అలాగే తిరుమలలో పొల్యూషన్ కూడా అధికమవుతుంది ఈ నేపథ్యంలో తిరుపతి ఆర్టీవో అధికారులు తిరుమలలోని ట్రాఫిక్ పోలీసులతో కలిసి మొబైల్ పొల్యూషన్ వాహనంతో వాహనాలకు పొల్యూషన్ చెకింగ్ చేపట్టారు. ప్రత్యేకంగా తిరుమలకు పొల్యూషన్ చెకింగ్ మిషన్ తీసుకువచ్చి అక్కడ తిరుగుతున్న వాహనాలను గుర్తించారు, దాదాపు 24 వాహనాలకు పొల్యూషన్ అధికంగా ఉందని గుర్తించా మని, కొన్నివాహ వాహనాలు ఫిట్నెస్ లేవని గుర్తించడం జరిగిందని, వాహనాలు తగిన ఫిట్నెస్ కలిగిన తర్వాతనే తిరుమలకు అనుమతించే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు సీనియర్ మోటార్ వాహనాల తనిఖీ అధికారి శ్రీనివాస రావు. తిరుపతి ఆర్టీవో అధికారులతో పాటు తిరుమల ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ సిబ్బంది ఈ తనిఖీలలో పాల్గొన్నారు.




# తిరుమలలో అదనపు ఈవో తనిఖీలు

**తిరుమల, మే1, మనం న్యూస్:** శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న కొబ్బరికాయలు విక్రయ కేంద్రం, టీటీడీ ప్రచురణల విక్రయ కేంద్రం, డాలర్ల విక్రయ కేంద్రాలను గురువారం ఉదయం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. ముందుగా అఖిలాండం వద్ద ఉన్న కొబ్బరికాయలు విక్రయ కేంద్రంలో తనిఖీలు నిర్వహించి కొబ్బరి కాయల సైజును పరిశీలించారు. కొబ్బరి కాయల విక్రయంపై భక్తుల అభిప్రాయాలను ఆరా తీశారు. అనంతరం టీటీడీ ప్రచురణల విక్రయ కేంద్రానికి చేరుకున్న అదనపు ఈవో స్టాక్ ను పరిశీలించారు. అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. అదేవిధంగా టీటీడీ డాలర్ల విక్రయ కేంద్రానికి చేరుకుని డాలర్ల విక్రయం పరిశీలించారు. అమ్మకాలపై వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.



# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళం

**తిరుమల,మే1,మనం న్యూస్:** హైదరాబాద్ కు చెందిన వారాహి చలన చిత్రం వ్యవస్థాపకుడు, సినీ నిర్మాత శ్రీ సాయి కూరపాటి ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు గురువారం రూ.17 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని అన్నమయ్య భవన్ లో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ విరాళాన్ని భక్తులకు మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు ఉపయోగించాలని దాత కోరారు.



# కిషోరీ బాలిక వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాల పోస్టర్లు విడుదల

**తిరుపతి, మే 1(మనంన్యూస్):** కిషోరీ బాలిక వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళిక గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రోజు ఈ కార్యక్రమౌ ముఖ్య ఉద్దేశం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులు చేయవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. ఈ కార్యకలాపాలను సమర్ధవంతంగా అమలుఅయ్యేలా అన్ని శాఖలు సమర్ధవంతగా పని చేయవలెనని తెలిపారు. మే 2 నుంచి జూన్ 10 వరకు వివిధ అంశములు పైన మహిళా పోలీస్, అంగన్వాడీ టీచర్, ఏ ఎన్ ఎం, ఆశా వర్కర్, మొదలగు వారు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వసంత బాయి, సి డి పి ఓ శివ శంకర్, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.



## కిరాయి సైకిల్

ముందు కాంచిల్ తొక్కలే
తరువాత దండే ఎక్కాలే
సీటు ఎక్కితే కాళ్లు అందవనే
ఎగిరే ఆలోచనలకు బ్రేకు లేసి
జారే లాగును ఎగజెక్కుతూ తిరుగుడు

చారాణా, అఠాణా, భారాణా
కూడెయ్యడానికి నానాపాట్లు
చిట్టారు కొమ్మన చింత బొట్లు కొట్టుడు
పంట చేనుల్ల పరిగె కంకులేరుడు
లూటీవోయిన పొలాల్లో గింజలేరుడు

చిన్న సైకిలా? పెద్ద సైకిలా? తేలక
చెమట పట్టిన నెత్తిని గోకుతుంటే
ఉద్దెర బ్యారమా? నగదు బ్యారమా?అనే
ఎక్కిలి నవ్వుల ఓనరును ఓరకంట చూస్తూ

ఒకటో నెంబర్ సైకిల్ పై చెయ్యేస్తే
సామిరంగా! స్వర్గం మెక్కినట్టుండేది!

మూడు రూపాయల  కిరాయికి
గంటలో ముల్లోకాలను జయించినట్టు
సందు గొందులు బలాదూర్గా తిరుగుతుంటే
సప్తసముద్రాలు దాటినంత సంతోషం
గుంతలు మిట్టలు ఎక్కి దిగుతుంటే
సైకిల్ కే చెమటలు పట్టించినంత ఆనందం


దోస్తుగాళ్ల ముందు బడాయికోయి
కాళ్లు చేతులు చెక్కలు చక్కలు చేసుకున్నా
ఏమెరగని ఎర్రిపిల్లగానిగా ఎగిరెగిరి తొక్కుడు
మీసం మేలేసినంతగా మురుసుడు

టైం అయ్యింది? అనే మాట
ఆకాశమంత ఆనందాన్ని ఆవిరి చేసేది


ఆ జ్ఞాపకాల దొంతరలలో జారుకున్నప్పుడు
కిరాయి సైకిల్ ను నెమరేసుకోవడం
ఆ అంతరాల సమాజంలో
ఐరావతం ఎక్కినంత సంబరంలా ఉండేది.

**- డా.ఎడ్ల కల్లేశ్**
9866765126

# ఉగ్రవాదం... భారత్ సమగ్రతకు శాపం



అందమైన కాశ్మీరం ఆనందంలో మునిగి తేలుతుండగా,ప్రకృతి పారవశ్యంలో పర్యాటకులు ఆనంద డోలికల్లో విహరిస్తుండగా మానవత్వం మచ్చుకైనా కానరాని ముష్కరుల తూటాలకు పలువురు మృత్యువు ఒడికి చేరారు. అమాయకుల రుధిరంతో పచ్చని పహల్గాం ఎరుపెక్కింది.అమర్ నాథ్ యాత్రకు శ్రీకారం పలుకుతున్న కాశ్మీర్‌లోని పహల్గామ్ పేరొందిన పర్యాటక కేంద్రం. ఇదొక హిల్ స్టేషన్. పహల్గాం బైసరన్ లోయ స్విట్జర్లాండ్‌కు ప్రతిరూపంగా పేర్కొంటారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో మదిని పులకరింప చేసే అందమైన పర్యాటక ప్రాంతం ముష్కరుల నరమేథంతో మూగబోయింది. ప్రాణాలు కోల్పోయిన వారి బంధువుల ఆక్రందనలు మిన్నంటాయి. క్షతగాత్రుల దేహాలు రక్తంతో తడిసిపోయాయి. బైసరన్ లోయలో అందమైన ప్రకృతి అలజడికి లోనై విలపించింది. సైనికుల దుస్తుల మాటున పొంచి ఉన్న మృత్యువును గమనించలేని పర్యాటకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓలలాడుతుండగా ఓర్వలేని ఉగ్రమూక పంజా విసిరి, 28 మంది పర్యాటకులను కర్కశంగా బలితీసుకుంది. దొంగే దొంగ అన్నట్టుగా...ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ, భారత్ పై గత 77 సంవత్సరాలుగా అనునిత్యం కయ్యానికి కాలు దువ్వుతున్న పాక్ ప్రేరిత ఉగ్రవాదం పై ప్రపంచం దృష్టి సారించక పోవడమే ఈ నర మేథానికి కారణం.నాగరికత వెల్లివిరిసిన నేటి ప్రపంచంలో మనుషుల రక్తం త్రాగే ఉగ్రవాద మూకలు వికృతంగా, క్రూరంగా ప్రవర్తించడం మానవత్వానికే మాయని మచ్చ. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్వి పోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో ప్రజలు అసహ్యించు కుంటున్నా, బరితెగించి, అమాయక ప్రజలను కాల్చి చంపుతున్న ఉగ్రవాదులు నేటి ఆధునిక సమాజంలో జీవించడానికి అనర్హులు. ఉగ్రవాద మూకలతో అంటకాగుతూ పాము పడగ నీడలో నిద్రపోవాలనే ఆలోచన రావడమే పాక్ మూర్ఖత్వం. ఉగ్రవాదులకు అండగా నిలబడుతూ పాక్ సాధించేదేమీ ఉండదు. ప్రస్తుతం పాక్ అస్థిత్వానికే ముప్పు ఏర్పడింది. పాక్ పతనమౌతూ, భారత్ ను నాశనం చేయడానికి ప్రయత్నించడం 'తాచెడ్డ కోతి వనమంతా చెడగొట్టిన' చందంగా ఉంది. అపారమైన ఖనిజ వనరులతో అలరాడుతున్న బలూచిస్తాన్ ను చైనా కు అప్పగించే విధంగా ఆర్థిక కారిడార్ నిర్మాణానికి చైనాకు పాక్ అనుమతినిచ్చి, భారత్ సమగ్రతను ప్రశ్నార్థకం చేయబూనడం క్షమార్హం కాదు. ఆర్థిక పతనంతో పాక్ ప్రజలకు భిక్షాటనను ఒక వృత్తిగా ప్రవేశ పెట్టిన పాకిస్తాన్ స్వయంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. పాక్‌లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభమే దీనికి ఒక కారణం కావచ్చు. వ్యక్తులను,వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలితీసుకుంటూ, నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తున్న పాక్ పాలకుల దుర్నీతిని ప్రపంచమంతా ఏవగించుకుంటున్నది. మానవత్వం నశించిన కరడు గట్టిన పైశాచిక వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లోమారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్వంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు.ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో అశాంతిని సృష్టించే సామ్రాజ్యవాద శక్తులు ఒకవైపు, అకారణ కలహాలతో నిరంతరం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటూ ఏదో సాధించాలన్న తపనతో మానవత్వాన్ని మంటగలిపి,ఆ మంటల్లో చలికాసుకునే పైశాచికత్వం మరోవైపు ప్రపంచంలో ప్రబలిపోతుండడం విచారకరం. మానవత్వపు ఛాయలు విచ్ఛిన్నకారుల మనస్సుల్లో మచ్చుకైనా కానరావు. కరడు గట్టిన రాక్షసత్వమే నైజంగా బ్రతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా, సంస్కర్తలుగా కీర్తించే దేశాలకు, ఉగ్రమూకలకు వత్తాసు పలుకుతూ, వారు సాగించే ఘోరహింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలను వర్ణింపతరం కాదు.



సామ్రాజ్యవాదంతోనో, స్వేచ్ఛ పేరు తోనో అమాయకుల కుత్తుకలను ఖండించే దుశ్చర్యలకు పాల్పడే తీవ్రమైన కర్కశవాదాన్నే ఉగ్రవాదమని నిర్వచించ వచ్చు. చాలామంది ఉగ్రవాదులకు తమ కార్యకాలాపాలకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు.కొంతమంది ప్రోద్బలం తోనో, వారిచేత ప్రేరేపించబడిన తీవ్రమైన మానసిక భావజాలంతోనో ఉగ్రవాదులుగా మారిన వారు కొందరైతే... ఉగ్రవాద శిబిరాలను నడుపుతూ ఇతర దేశాల నుండి ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడుతున్న ధన,కనక,వస్తువాహనాలపై మోజుపడి స్వార్థ పూరితమైన లక్ష్యాలతో ఉగ్రవాదులను పెంచి పోషించే వారు మరికొందరు ప్రపంచాన్ని అశాంతికి గురి చేస్తున్నారు. ఉగ్రవాదం కూడా కొంతమందికి ఉపాధినిచ్చే ముడి సరుకుగా మారడం అత్యంతహేయం. ఆంగ్లేయుల విభజన వాదంతో ముస్లిం ప్రజల్లో నెలకొన్న అపోహల వలన, నాటి పాలకుల ఉదాసీన వైఖరి వలన భారతదేశ విభజన జరిగిన మాట వాస్తవం. చైనా, ఇండియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, అరేబియా సముద్రం సరిహద్దులుగా ఉన్న పాకిస్తాన్ 1947లో భారత్ నుండి విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మహమ్మదాలీ జిన్నా నాయకత్వంలోనే భారత దేశం మత ప్రాతిపదికన విడిపోయింది.

పాక్ ఒక స్వతంత్ర ఇస్లామిక్ దేశంగా ఏర్పడింది. విభజించు...పాలించు అనే ఆంగ్ల విధానానికి అనుగుణంగా ఆంగ్లేయుల చిచ్చు కారణంగా భారత్‌లోని హిందూ ముస్లింలలో చీలిక ఏర్పడింది. పాక్ స్వతంత్ర దేశంగా అవతరించినా భారత్‌పై నిరంతరం కయ్యా నికి కాలు దువ్వుతూనే ఉంది. పాక్ పాలకుల దుశ్చర్యలతో విసిగి పోయిన ఆ దేశ ప్రజల్లో అసహనం పెరిగిపోయింది.పాక్ ప్రజల్లో గూడుకట్టుకున్న స్వతంత్ర కాంక్ష ఉవ్వెత్తున లెగిసింది. బలూచిస్తాన్, సింధ్ ప్రాంతాలు పాక్ నుండి స్వేచ్ఛను కోరుకుంటూ స్వతంత్ర దేశాలుగా విడిపోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఖబర్ పఖ్తుంఖ్వా ప్రాంతం ఆఫ్ఘనిస్తాన్‌లో విలీనమయ్యే అవకాశ ముంది.

పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్ లో విలీనమయ్యే రోజులు దగ్గరలో ఉన్నాయి. ఈ పరిస్థితి నుండి గట్టెక్కడం చేతగాక ప్రజల దృష్టిని,ప్రపంచం దృష్టిని మరల్చడానికి కాశ్మీర్ లో రక్తపాతం సృష్టించడానికి నిరంతరం విధ్వంస ప్రణాళికలు రచిస్తూ, అమాయకప్రజల రుధిరాన్ని ఆస్వాదిస్తూ, కర్కశమూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారి,లష్కరే తోయిబా వంటి అనుబంధ ఉగ్రవాద సంస్థలకు ఊతమిస్తున్న దాయాది దేశం తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాయబారాలతో,ఒప్పందాలతో రాజీ పడని మనస్తత్వాలకు దండోపాయమే శరణ్యమన్న సూత్రం ఉరిమురిమి చూసే ఉగ్రదేశమైనపాకిస్థాన్ కు అన్వయించక తప్పదు.భారత్ ను ఇబ్బందుల పాలు చేస్తున్న పాక్ కు కాలమే తగిన సమాధానం చెప్పాలి. రక్తపాతం ఏనాటికీ సమస్యలకు పరిష్కారం కాదన్న సత్యం త్వరలోనే పాక్ కు అవగతమవుతుంది. పహల్గాం లో జరిగిన నరమేథంతో పాక్ ఏరికోరి కష్టాలను కోరితెచ్చుకున్నట్టే, ఈ సంఘటను మోడీ సర్కార్ చూస్తూ ఊరుకుంటుందనుకోవడం భ్రమ మాత్రమే. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు తమ భూభాగాలను భారత్ లో విలీనం చేయాలని కోరుకుంటున్న తరుణంలో పాక్ పై భారత్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

పాక్ ఆక్రమిత కాశ్మీర్ లేకుండా జమ్మూ కాశ్మీర్ పరిపూర్ణత్వం కాలేదని, త్వరలో పి. ఓ.కె భారత్ లో విలీనమౌతుందని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కొద్దినెలల క్రిందట పేర్కొనడం ఈ సందర్భంగా గమనించాలి. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా పిఓకె ప్రజలను పాకిస్తాన్ విదేశీయులుగా భావించి చిన్న చూపు చూస్తున్నదని, తమ దేశంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ విలీనమైతే స్వంత ప్రజల్లా చూస్తామని చెప్పడాన్ని బట్టి చూస్తే త్వరలోనే భారత్ లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ విలీనం కావడం ఖాయమని అవగతమవుతున్నది. అయితే భారత్ యుద్ధం చేసి పాక్ ఆక్రమిత భూభాగాలను స్వాధీనం చేసుకుంటుందా? పాక్ పాలకులే స్వయంగా తాము ఆక్రమించిన భూభాగాలను భారత్ కు అప్పగిస్తారా? ప్లెబిసైట్ ద్వారా ప్రజలే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారా అనే విషయం స్పష్టం కావలసి ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ పై భారత్ యుద్ధానికి దిగవచ్చనే సంకేతాలు కూడా వెలువడుతున్నాయి. ఆర్టికల్ 370 తొలగించిన తర్వాత భారత్ చేయబోయే అతి పెద్ద సాహసం పాక్ ఆక్రమిత కశ్మీర్ ను వశపరచుకోవడమే.అయితే ఇది ఎంత వరకు సాధ్యమో ఊహించలేం. పహల్గాం మారణకాండ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# లియొనార్డో డా విన్సీ-ఆధునిక విద్యకు మార్గదర్శి



లియొనార్డో డా విన్సీ (1452-1519) యూనివర్సల్ మాన్‌గా పేరొందారు. ఆయన కళ, శాస్త్రం, ఇంజనీరింగ్ రంగాల్లో చూపిన ప్రతిభ ఎంతో గొప్పది. 1519 మే 2న ఆయన ఈ లోకాన్ని విడిచినా, ఆయన సృష్టించిన కళాఖండాలు, ఆలోచనలు ఇప్పటికీ లక్షలాది మందికి ప్రేరణనిస్తున్నాయి. మోనాలిసా వంటి చిత్రాలు ఆయన సృజనాత్మకతను, గంభీరమైన కళ్లొలికిన చూపును వెలిబుచ్చుతాయి. ప్రతి రంగమూ పరస్పర సంబంధంతో ఉందని లియొనార్డో నమ్మారు. ఆయన జిజ్ఞాస,లోతైన పరిశీలన ధోరణి ఆయన గొప్ప ఆవిష్కరణలకు బాటలు వేసింది. నేటికీ ఆయన ఆలోచన పద్ధతులు విద్య, శాస్త్రం, కళల్లో ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

లియొనార్డో డా విన్సీ పరిశీలించి నేర్చుకోవాలని, ప్రశ్నలు అడగాలని నమ్మేవారు.ఆయన నోటుబుక్స్లో మనకు కనిపించే దృశ్యాలు, అద్దం ప్రతిబింబ లిపి (మిరర్ రైటింగ్), అలాగే 'ఆకాశం నీలంగా ఎందుకు కనిపిస్తుంది?', 'పక్షులు ఎలా ఎగురుతాయి?' వంటి ఆసక్తికరమైన అంశాలపై ఆయన ఆలోచనలు మనకు తెలియజేస్తాయి. లియొనార్డో తెలిపిన ప్రకారం, మనం ఏదైనా విషయాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే, ముందు ప్రశ్నలు వేయాలి, జిజ్ఞాస చూపాలి. ఆ తర్వాతే వివిధ రంగాల మధ్య సంబంధాలను అన్వేషించి వాటిని సమన్వయం చేయగలిగితేనే గాఢమైన అవగాహనకు చేరుకోవచ్చు' అని ఆయన విశ్వాసం.

లియొనార్డో డా విన్సీ అభిప్రాయం ప్రకారం, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి 'దృష్టి' ముఖ్యం. కంటితో మాత్రమే, మనసు సత్యాన్ని - సౌందర్యాన్ని అనుభవించగలదని ఆయన నమ్మాడు.చిత్రకళను ఆయన కేవలం కళగా కాదు, శాస్త్రంగా చూశాడు - ఇది ప్రజలకు నేర్చుకునే ఒక మార్గమని భావించాడు.

దృష్టికి మెదడులో ప్రత్యేక స్థానం ఉందని చెప్పిన ఆయన, దానిని 'ఇంప్రెస్సివా' అని పిలిచాడు. చిన్నచిన్న విషయాలను కూడా అధిక ఆసక్తితో పరిశీలించేవాడు. టేబుల్ మీదున్న ధూళికణాల నుంచి మానవ శరీరంలోని అవయవాల విభజన వరకు. ఈ లోతైన పరిశీలనా ధోరణి ఆయనకు కొత్త ఆలోచనలవైపు దారితీసింది, అప్పటి పాత నమ్మకాలను సవాలు చేసింది.

లియొనార్డో తన శాస్త్ర పరిశోధనలో ఆరిస్టాటిల్ భావనలను ఆధారంగా తీసుకొని నాలుగు ముఖ్యమైన శక్తులపై-గతివ్యవస్థ, బరువు, బలం, మరియు కంపనం-కేంద్రంగా పరిశీలించాడు. కొన్ని ఆలోచనలు ఇప్పుడు పాతబడినప్పటికీ, ప్రకృతి మరియు మానవ శరీరాన్ని వివరించడంలో ఆయన చేసిన ప్రయత్నం అద్భుతం.శాస్త్రం మరియు కళలను కలిపిన ఆయన ప్రత్యేకమైన విధానం అతన్ని ప్రత్యేకంగా నిలిపింది.

లియొనార్డో కళ, శాస్త్రం రెండింటికీ సృజనాత్మకత అనేది కీలకమని నమ్మేవాడు. ప్రకృతిని అన్వేషించడానికి అతను కల్పనను ఉపయోగించి, కళా నైపుణ్యాన్ని శాస్త్రవేత్తల ఆలోచనతో మిళితం చేశాడు. అతనికి కళ అనేది ప్రపంచాన్ని అర్థం చేసుకునే ఒక



మార్గం,కళాకారులు కూడా శాస్త్రవేత్తల్లా దానిని సమీపంగా అధ్యయనం చేయాలి అని భావించాడు.

లియొనార్డో డా విన్సీ కృషి కళ, శరీరరచన, భూగోళశాస్త్రం, ఇంజనీరింగ్ వంటి అనేక రంగాల్లో విస్తరించింది. అతని చిత్రకళా ఆవిష్కరణల్లో లీనియర్ పరిమాణం, కియారోస్కురో, స్ఫుమాటో వంటి శైలులు ప్రధానమైనవి. ఇవి చిత్రాలకు లోతు, వాస్తవికతను సమకూర్చాయి. శరీరరచనలో, అతని వివరమైన విశ్లేషణలు విట్రువియన్ మాన్ వంటి ముఖ్యమైన చిత్రాలను సృష్టించాయి. భూగోళశాస్త్రజ్ఞానిగా, అతను వ్యూహాత్మక ఉద్దేశ్యాల కోసం ఖచ్చితమైన గగనచిత్ర మ్యాపులను రూపొందించాడు. ఇంజనీరింగ్ లో, అతని ఆవిష్కరణలు, పైకింగ్ యంత్రాలు,ట్యాంకులు, భౌతిక శాస్త్రం మరియు యంత్రశాస్త్రం లో అతని లోతైన అవగాహనను చూపించాయి. లియొనార్డో డా విన్సీ శాస్త్రీయ దృష్టిని కళతో సమ్మిళితంగా ఉపయోగించగలిగిన అరుదైన ప్రతిభాశాలి.లియొనార్డో డా విన్సీ యొక్క అత్యంత ప్రఖ్యాత కృతుల్లో మోనా లీసా ముందువరుసలో నిలుస్తుంది. ఈ చిత్రంలో కనిపించే రహస్యమైన చిరునవ్వు, కాంతి-చాయల (చియారోస్క్యూరో) అద్భుత వినియోగం చిత్రానికి విశేష ఆకర్షణ కల్పించాయి. ఇందులో జీవాంతకమైన భావాలు, లోతైన వ్యక్తిత్వం ప్రతిబింబించటం వల్ల ఇది శతాబ్దాలుగా కళాకారులను ప్రభావితం చేస్తోంది.

ది లాస్ట్ సపర్ చిత్రంలో లియొనార్డో దృష్టికోణ వినియోగాన్ని విప్లవాత్మకంగా పరిచయం చేశారు. విట్రూవియన్ మాన్ చిత్రంలో శరీరరచనపై ఆయన లోతైన అవగాహనను స్పష్టంగా చూపించారు. 'అన్నొన్సియేషన్' వంటి ప్రారంభకృతుల్లో ఆయన సూక్ష్మ పరిశీలన స్పష్టంగా కనిపిస్తుంది, ది బాప్టిజమ్ ఆఫ్ క్రైస్ట్ చిత్రంలో సహజ శైలి ప్రతిఫలించుతుంది. ఈ సమస్త కృతులు, స్కెచ్లు, ముగియని రచనలు లియొనార్డో డా విన్సీ ఎలా కళను శాస్త్రంతో సమన్వయం చేశారో నిరూపిస్తాయి. ఇవి అతనిని చరిత్రలో అగ్రగణ్య కళాకారుడిగా నిలిపాయి. లియొనార్డో డా విన్సీ సృజనాత్మకత, జిజ్ఞాస, తేలికైన పరిశీలనతో మనిషి సామర్థ్యం ఎంతదూరం వెళ్లగలదో నిరూపించారు. ఆయన 500 ఏళ్ల క్రితం జీవించినా, కళ, శాస్త్రం, ఇంజనీరింగ్లో చేసిన అభివృద్ధులు ఇప్పటికీ మనకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ఈ వేగంగా మారుతున్న ప్రపంచంలో, ఆయన ఆలోచనలు మనకు గుర్తు చేస్తున్నది - మనం లోతుగా ఆలోచించాలి, కొత్త విషయాలపై ఆసక్తి కలిగించాలి, అలాగే మన ప్రతిభను భావితరాల కోసం సమర్థంగా ఉపయోగించుకోవాలి.

లియొనార్డో చేసిన కళ, శాస్త్రం, సాంకేతిక పరిశోధనలు నేటికీ ఎంతో మందిని ప్రభావితం చేస్తున్నాయి. ఆయన నేర్చుకున్న విధానం మనకు అనేక ముఖ్యమైన పాఠాలను నేర్పిస్తుంది. విభిన్న విషయాల మధ్య సంబంధాలను అన్వయించగలిగితే సృజనాత్మకంగా ఆలోచించగలమని ఆయన నమ్మారు. భావాలను వివరించేందుకు ఆయన దృశ్యాలు, చిత్రాలు వాడారు. జిజ్ఞాసతో నేర్చుకోవడం, విషయాన్ని నిజంగా అర్థం చేసుకోవడమే ముఖ్యమని చెప్పారు. పరీక్షలకే పరిమితంగా కాకుండా, పొరపాట్లు చేసి, ప్రయోగాలు నిర్వహిస్తూ నేర్చుకోవడమే నిజమైన విజ్ఞాన మార్గమని ఆయన చూపించారు. లియొనార్డో డా విన్సీ జీవితం మనకు తెలిసినదానికన్నా తెలుసుకోవలసింది ఇంకా చాలా ఉందని చెప్పే మార్గదర్శక దీపంలాంటిది.

**- డా. కృష్ణకుమార్ వేపకొమ్మ**
9849562910

# అధికంగా అమ్ముడైన 'హారీ పోట్టర్'



ప్రపంచ సాహిత్య చరిత్రలో హారీ పోట్టర్ నవలలు సృష్టించిన ప్రభంజనం అద్భుతం, ఆశ్చర్యకరం. హారీ పోట్టర్ శ్రేణిలో వచ్చిన ఏడు నవలలు ఆబాలగోపాలాన్ని ఒప్పించి మెప్పుపొందడం గొప్ప విషయం. ప్రజాదరణను దృష్టిలో పెట్టుకుని 2012లో యూకె ప్రధాన మంత్రి డేవిడ్ కామరూన్ చొరవతో జె. కె. రౌలింగ్ రచించిన హారీ పోట్టర్ నవలా శ్రేణి పుస్తకాలకు మరింత గౌరవం, ప్రచారం కల్పించడానికి ప్రతి ఏట 02 మే రోజున అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం (ఇంటర్నేషనల్ హారా పోట్టర్ డే) పాటించడం ప్రారంభం అయ్యింది. 1997తో మొదలు 2007 వరకు వరుసగా ఏడు సీరియల్ ఫాంటసీ నవలలు మార్కెట్లోకి రావడం, క్షణాల్లో లక్షల కాపీలు అమ్ముడు పోవడం చకచకా జరిగిపోయాయి. హారీ పోట్టర్ నవలల ప్రభంజనం నేటికీ తగ్గలేదంటేనే ఆ సాహిత్య మహిమ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. హారీ పోట్టర్ నవలలు ఏకంగా 600 మిలియన్ల వరకు అమ్ముడుపోవడం వల్ల గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్ రికార్డును సాధించి చరిత్ర సృష్టించింది.

02 మే 1998న జరిగిన బ్యాటిల్ ఆఫ్ హోగార్ట్స్కు నివాళిగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 02 మే రోజున అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం సందర్భంగా ఆ నవలల్లోని పాత్రలకు అనుగుణంగా వేషాలు వేయడం, సంబరాలు చేసుకోవడం, హారీ పోట్టర్ పుస్తకాలు మరో సారి చదవడం, హారీ పోట్టర్ సినిమాలను చూడడం, పుస్తక దుకాణాలు /గ్రంథాలయాలు/ అభిమాన సంఘాలు హారీ పోట్టర్ ఆధారిత పోటీలను నిర్వహించడం జరుగుతున్నది. హారీ పోట్టర్ కల్పిత కథలోని పాత్రలను గుర్తు చేసుకుంటూ మరథాన్లు నిర్వహించడం వరకు తమ అభిమానాన్ని, ప్రేమను వ్యక్తం చేయడం నేటికీ కొనసాగుతున్నది.

రచయిత్రి జోఅన్నె రౌలింగ్ సాధారణ కలం పేరు జె. కె. రౌలింగ్ ఒక గొప్ప సాహితీవేత్తగానే



కాకుండా దాతృత్వం కలిగిన ప్రఖ్యాత కాల్పిత కథల రచయిత్రి. 1997లో హారీ పోట్టర్ అండ్ ది ఫిలాసఫర్స్ స్టోన్ పేరుతో తొలి ఫాంటసీ నవల విడుదల కావడం, ప్రభంజనం సృష్టించడం, దాని తర్వాత వరుసగా మరో ఆరు సీరియల్ నవలలు విడుదల కావడం, 2007లో చివరి హారీ పోట్టర్ నవల హారీ పోట్టర్ అండ్ ది డెడ్లీ హాల్లోస్ విడుదల కావడం, ఈ మొత్తం ఏడు నవలలు అత్యధికంగా అమ్ముడుపోవడం ఓ అద్భుతమైన సాహిత్య ఘనకార్యం. హారీ పోట్టర్ శ్రేణి ఊహాత్మక కథల పుస్తకాలతో పాటు డ్రామా, యువతకు సంబంధించిన కట్టుకథలు, నేర కల్పిత కథలు లాంటి రచనలు కూడా చేసిన రౌలింగ్ నేటికీ తన రచనలతో సాహిత్య అభిమానుల మనసులు గెలుచుకుంటున్నది. చెడుపై మంచి, చీకటిపై వెలుగుల విజయానికి, న్యాయ పోరాటానికి సూచికగా నిలుస్తున్న హారీ పోట్టర్ కల్పిత కథతో కూడిన నవలలు నేటికీ పౌర సమాజం ప్రేమ, స్నేహం, విధేయతలకు చిరునామాగా నిలుస్తూ విద్య విజ్ఞాన సంపన్న హీరోలైన వారందరూ అన్ని అడ్డంకులను ఛేదించుకుంటూ విజయతీరాలకు చేరతారనే నమ్మకాన్ని అనుభూతి పొందడం ఆశ్చర్యకరం, అభినందనీయం.

**(02 మే అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం సందర్భంగా)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# కులగణనతోనే సామాజిక న్యాయం



జనగణన ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుకు దిక్సూచిగా పనిచేస్తుంది. ప్రజాస్వామ్య దేశాల్లో సామాన్యుని సాధికారిత, యువజన సాధికారిత, మహిళా సాధికారిత సాధనకు జనగణన సమాచారాన్ని సమ కూరుస్తుంది. భారత దేశంలో ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తారు. 2021లో జరుగవలసిన జనగణన పదే పదే వాయిదా పడుతుంది. కోవిడ్ కారణంగా భారత్‌లో జనగణన వాయిదా పడినప్పటికి అమెరికా' చైనా' బ్రిటన్ 'బంగ్లాదేశ్ నేపాల్ దేశాలు మహమ్మారికి వెరువకుండ జనగణన కార్యక్రమాన్ని పూర్తి చేసి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నాయి. భారత దేశంలో జనగణన చేపట్టాలన్న స్వచ్ఛంధ సంస్థల పౌర సమాజం చేస్తున్న ఆందోళన ఒత్తిడిని ప్రభుత్వం పెడచెవిన పెట్టడం శోచనీయం.

మేము ఎంతో మా వాటా అంత అన్న నినాదంతో బి.సి వర్గాలు చేస్తున్న పోరాటాలు, దేశ వ్యాప్తంగా రాజ్యాధికారంలో బలహీన వర్గాల వాటా కోసం ఉద్యమాలు ఉధృతంగా సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిసే దాకా వెనక బడిన వర్గాల కుల గణన వాయిదా వేయాలని ప్రభుత్వం భావించడమే జనగణనలో అసాధారణ జాప్యానికి కారణమనే వాదనలు సామాజిక రాజకీయ వేత్తలు వ్యక్తం చేస్తున్నారు. స్వతంత్ర భారతంలో జరిగిన అభివృద్ధి ఫలాలు ప్రజా సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు సరైన విధం గా ఆశించిన స్థాయిలో సమకూరలేదనే అంశాలు బయటపడతాయనే ఆందోళన జనగణన వాయి దాకు కారణం కావచ్చును అనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం జనగణన కార్యక్రమాన్ని వాయిదా వేయడం వల్ల దేశంలో పేదరికం, నిరుద్యోగం ఆర్థిక అసమానతలు, వలసలు, ఆకలి చావులు, లింగవివక్ష, బాలకార్మికులు, గ్రామీణ, పట్టణ వ్యత్యాసాలు, ప్రాంతీయ అసమానతల వ్యాప్తిని తీవ్రతను అంచనా వేయలేక పోవడం వల్ల అభివృద్ధి మందగిస్తుంది. జనగణన సమాచారం ఆధారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ నిధులు ఇతర వనరుల కేటాయింపు నియోజక వర్గాల హద్దుల నిర్ణయం ఎస్సీ,ఎస్టీ, బీ.సీ మహిళలకు,రాజకీయ ప్రాతినిధ్యం అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన,ఆర్థిక, వికేంద్రీకరణ స్థానిక సంస్థల సాధికారిత సహజ వనరుల వినియోగం, వనరుల కేటాయింపు, పంపిణీ ఏవిధంగా జరుగుతుంది అనే సమాచారం తెలుస్తుంది. గ్రామ, పట్టణ, మున్సిపల్ వార్డ్ స్థాయిలో విద్య, వైద్య, తాగునీరు, రవాణా, రోడ్లు మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారం జనగణన ద్వారా తెలుసుకోగలరు.

1990 సంవత్సరంలో భారత్‌లో లింగ నిష్పత్తి దెబ్బతింటుందని జనగణన ద్వారానే తెలిసింది. భ్రూణ హత్యల కారణంగా సీ, పురుష నిష్పత్తిలో అసమానతలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం ఆడ శిశువుల హననాన్ని నిషేధించింది. భేటీ బచావో భేటీ పడావో వంటి కార్యక్రమాలకు దేశంలో ఆర్థికంగా, పారిశ్రామికంగా వెనుకబడిన జిల్లాల గుర్తింపు స్వచ్ఛ భారత్ కార్యక్రమాలకు జనగణన ప్రేరణగా నిలిచింది. జాతీయ స్థాయిలో ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు పేదలకు ఉచిత ఆహార పంపిణీ, గ్యాస్ కనెక్షన్,ఆహార భద్రత చట్టానికి జనగణన వల్ల వచ్చిన సమాచారం చాలా ఉపయోగపడ్డది. కుల గణన ఒక ప్రజాస్వామిక అవసరం. కులగణతో సామాజిక న్యాయం పంపిణీ న్యాయం సిద్ధిస్తుంది. భారత్ దేశ జనగణన బ్రిటిష్ వారు పన్నుల వసూలు కొరకు 1866లో చేశారు. బ్రిటిష్ వారు 1931 వరకు కులాల వారి జనగణన పద్ధతిని కొనసాగించారు జనాభాలో కుల గణన చివరిసారి బ్రిటిష్ వాళ్ళ హయంలోనే జరిగింది. నేటి వరకు భారత ప్రభుత్వం దగ్గర బ్రిటిష్ వారు చేసిన కుల గణన సమాచారమే అందుబాటులో వుంది. వెనక బడిన కులాల అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి వున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. దేశం లోని వివిధ రకాల సామాజిక కులాల సంక్షేమం కోసం అమల వుతున్న పథకాలు రాజ్యాంగ నిర్మాణ అనంతరం అమలు అవుతున్న రిజర్వేషన్స్ గత 90 యేళ్ల నాటి కులాల డాటా (సమాచారం)నే ప్రాతిపదిక కావడం శోచనీయం. హరిజన గిరిజనులకు వారి జనాభా ఆధారంగా రిజర్వేషన్స్ అమలు చేయాలన్న రాజ్యాంగ నియమావళి మాత్రమే అమల్లో ఉంది. 1931 నాటి జనగణన ప్రకారం బి.సి కులాల జనాభా 62 శాతం ఉన్నట్లు మండల్ కమిషన్ తేల్చింది. జనగణన ద్వారా దేశ మానవ వనరుల అభివృద్ధి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులు మానవాభి వృద్ధికి వనరులకు మధ్య సమతుల్యత ఏర్పడే అవకాశం ఉంది. దేశ వ్యాప్తంగా జనగణన లో కులగణన చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. కుల గణన చేపట్టటానికి జనగణన అంశాలలో కులగణన అంశాన్ని అధనంగా చేర్చితే సరిపోతుంది. అనేక పార్టీలు సామాజిక కుల సంఘాలు కుల ఆధారిత జనగణన కొరకు ఒత్తిడి చేశాయి. 2011 జనాభా లెక్కల సందర్భంలో బలంగా చేసిన డిమాండ్ ను 2018 లో కులగణన కొరకు ప్రభుత్వం ఒప్పుకుంది. కేంద్రం సుప్రీమ్ కోర్టుకు కులగణన సమాచారాన్ని ఇవ్వలేమని పాలన పరమైన చిక్కులు సంక్లిష్టత ఉందని కుల గణన సమాచారాన్ని బయటకు చెప్పడం సున్నిత అంశమని అనాసక్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ వైఖరి బి.సి వర్గాలకు ఆశనిపాతంగా పరిణమించింది. సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఆయా నియోజక వర్గాల్లో కులం ఆధారంగా జనాభా కుల ఓటర్ల ఆధారంగా అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయిస్తున్నారు. అప్పుడు కులతత్వం అడ్డు రాదా? కులగణన చేస్తేనే కుల వ్యవస్థ బలపడుతుందా? రాజకీయ పార్టీలు అవలంభిచే దంద్వ వైఖరి సరైంది కాదు. కులాల ఆధారంగా జనాభా లెక్కలు జరిగితే రిజర్వేషన్ పరిధి 50 శాతం పైగా పెంచాలన్న డిమాండ్ ఉద్రుతమౌతుంది. విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో మరింత ప్రాతినిధ్యం పెంచాలన్న డిమాండ్ పెరుగుతుందన్న భావన ప్రభుత్వానికి వుంది. అక్స్ ఫామ్ నివేదిక 2020 ప్రకారం దేశ జనాభాలో 10 శాతం దగ్గర 74.3 శాతం సంపద, 40 శాతం జనాభా దగ్గర 22.9 శాతం, మరో 50 శాతం జనాభాకు కేవలం2.8 శాతం సంపద వుందని పేర్కొంది. 2018 సావిత్రి భాయి పూలే జె,ఎన్,యు, దళిత స్టడీస్ సంస్థ జరిపిన అధ్యయనంలో సంపద యాజమాన్యం అసమానతలు సామాజిక పరమైన అంశాలు అధ్యయనంలో ఇలాంటి వాస్తవాలు బయటపడ్డాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ,సెన్సెస్ కమిషనర్ కేంద్ర గణాంక కార్యాలయం జాతీయ గణాంక కమీషన్ల సమన్వయంతో జనగణనలో బాగంగా కులగణన చేపట్టడానికి కార్యాచరణ ప్రణాళికను అమలు చెయ్యాలి. ప్రభుత్వం ఆధునిక డిజిటల్ టెక్నాలజీ కృత్రిమ మేధను ఉపయోగించి కులాల వారి డాటా సమాచారాన్ని సేకరించాలి. జాతీయ గణాంక కమీషన్‌కు చట్టబద్ధత స్వతంత్ర ప్రతిపత్తిని కలిపించాలి.

జనగణన కులగణను నిర్దిష్ట కాల వ్యవధిలో నిర్వహించే విధంగా చట్టం చెయ్యాలి. జనగణనలో కుల గణన రాజ్యాంగ అనివార్యత ఏ ఏ కులాలు ఎంత మేరకు లబ్ధి పొందాయి. వాటి సామాజిక ఆర్థిక స్థితి గతులు ఏమిటి? ఆయా వ్యవస్థల్లో వారి ప్రాతినిధ్య ఎలా వుంది? రాజ్యాంగంలో వారికి ఇచ్చిన హక్కులు ఏ మేరకు నెరవేరాయి. ఉల్లంఘించబడాయి అనే విషయాన్ని సమీక్షించాలి. జనగణన లో కులగణన చేయడం వల్ల రాజ్యాంగ లక్ష్యాలైన స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం సామాజిక ఆర్థిక పంపిణీ న్యాయం సిద్ధించి ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. సకాలంలో జనగణన నిర్వహించి సమాచారాన్ని సేకరించక పోతే పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు ఎండమావులయ్యే ప్రమాదం వుంది.

**- నేదునూరి కనకయ్య**
9440245771

# ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా బట్టారి ఆంజనేయస్వామి



కరీంనగర్ టౌన్,మే1 (మనంన్యూస్): తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా , ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఇంచార్జి గా బట్టారి ఆంజనేయ స్వామి నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని ఐక్యం చేస్తూ వారి డిమాండ్ సాధనకై పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కమిటీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఉద్యమకారుల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని వ్యాఖ్యానించారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకాల జేఏసీ రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



.వరి ధాన్యం కొనుగోలు కేంద్రం లో ధాన్యం కొనుగోలు సంబంధించి ఆన్లైన్ ప్రోక్యూర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టం లో రైతుల వివరాలు వెంటనే నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. గురువారం మహబూబ్ నగర్ రూరల్ మండలం కోటకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అప్పాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లో ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు.సరైన తేమ శాతం,నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లుకు పంపించాలని ఆదేశించారు రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు.కొనుగోలు చేసిన వెంటనే రైతుకు కొనుగోలు వివరాలతో కూడిన కొనుగోలు పత్రం అంద చేయాలని అన్నారు.కొనుగోలు తర్వాత మిల్లుకు పంపే వరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడారు.కొనుగోలు చేసిన ధాన్యం మిల్లు కు రవాణా చేయుటకు అవసరమైన లారీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలు వెంట వెంటనే నమోదు చేసి రైతులకు చెల్లింపులు త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి శంకరా చారి,సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్,మహబూబ్ నగర్ రూరల్ తహశీల్దార్ సుందరా చారి, తదితరులు ఉన్నారు.

# కుల గణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం



- బీజేపీ రాష్ట్ర కోశాధికారి భండారి శాంతికుమార్

హైదరాబాద్, మే 1(మనంన్యూస్): భారతదేశ సామాజిక న్యాయాన్ని, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి భండారి శాంతికుమార్ పేర్కొన్నారు. గురువారం మహబూబ్‌నగర్ బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోకు పుష్పాభిషేకం చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ - 'కుల గణన సామాజికంగా వెనుకబడి ఉన్న వర్గాలను గుర్తించేందుకు, వారికి అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకు మార్గదర్శకంగా నిలుస్తుంది. అభివృద్ధి అనేది కేవలం ఆర్థికంగా కాక, సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమైంది,' అని తెలిపారు. శాంతికుమార్ మాట్లాడుతూ, 1881 నుండి 1931 వరకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రతి జనగణనలో కుల గణన నిర్వహించి, సమాజ నిర్మాణాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేసిందని తెలిపారు. కానీ స్వతంత్ర భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ దిక్కుమాలిన రాజకీయాల వల్ల కుల గణనను విస్మరించిందని ఆరోపించారు. అధికరణ 246 ప్రకారం 'గణన' అనే అంశం కేంద్ర జాబితాలో ఉందని, కాబట్టి జనగణన మరియు కుల గణన నిర్వహణ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడ్డాకుల బాలరాజు, మాజీ కౌన్సిలర్ చెన్న వీరయ్య, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబి రాజు, నాగరాజు, పిల్లి సూర్యనారాయణ, కొకుంట్ల ఆంజనేయులు, సుదర్శన్ గౌడ్, మంగలి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రోడ్డుపై బైఠాయించిన అన్నదాతల



రాయికల్, మే 01 (మనం న్యూస్): వరి కోతలు ప్రారంభమై నెల గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదంటూ రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు గురు వారం రోజున ఉప్పుమడుగు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కోసి ధాన్యాన్ని ధోబి ఘాట్ వద్ద కుప్పలు పోసి చాలా రోజులవుతున్న అధికారులు ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదని మండి పడ్డారు.అకాల వర్షాలు పడి ధాన్యం తడుస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి జిల్లా సహకార అధికారి సిహెచ్.మనోజ్ కుమార్, తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం లు చేరుకొని రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు మడుగు ఫ్యాక్స్ చైర్మన్ దీటి రాజరెడ్డి,వైస్ చైర్మన్ దుంపల స్వామిరెడ్డి, రైతులు దిండిగాల రామస్వామి, మాద రాజేశం, ముక్కెర నరేష్, మల్లీక్ అహ్మద్,వెంకటేష్, మహిపాల్,గంగాధర్, ఇస్మాయిల్, పల్లి మల్లయ్య, రాయమల్లు, భూమయ్య ముత్యాలు,అంజయ్య, నర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్ట్ లను వేగవంతంగా పూర్తి చేస్తాం

- గత పాలకుల వైఫల్యం వల్లే కృష్ణ వాటాలో అన్యాయం
- అరే దేన్లలో పాలమూరు రంగారెడ్డి ఏడాదిలో మిగతా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- సాగునీటి ప్రాజెక్ట్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు







నాగర్ కర్నూల్ ప్రతినిధి, మే 1 (మనం న్యూస్): మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి పూర్తి చేస్తాము. రెండు సంవత్సరాలలో పాలమూరు రంగారెడ్డిని ఏడాది కాలంలో కల్వకుర్తి నెట్టెంపాడు బీమా కోయిల్ సాగర్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లనే కృష్ణ వాటాలో నీటిని కోల్పోయామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి నీటి పంపకాల విషయంలో పట్టుబట్టి నీటి పెంపుదల కోసం కసరత్తు చేస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు అన్నారు.

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ లో ప్రధాన బాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్, ప్యాకేజీ 2 ఓపెన్ కెనాల్ మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ లిఫ్ట్ -1, వనపర్తి జిల్లా రేవల్లి మండలం ఏదుల రిజర్వాయర్, స్టేజ్ 2, కోడేరు మండలం తీగలపల్లి గ్రామంలో పాలమూరు-రంగా రెడ్డి ప్రాజెక్టు పంప్ హౌస్, సొరంగం, కాల్వ నిర్మాణ పనులను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల ప్రగతిని మంత్రులకు వివరించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ వేగవంతంగా చేయడానికి, సమస్యల పరిష్కారం, అవాంతరాలను తొలగించడానికి తాము ప్రాజెక్ట్ లను సందర్శించినట్లు చెప్పారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ లను పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పదేళ్లుగా ఈ ప్రాజెక్ట్ ల పనులు ముందుకు సాగలేదన్నారు. ఈ నాలుగు ప్రాజెక్టులన్నింటినీ సంపూర్ణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 2026 మార్చి 31 వరకు అన్ని విధాలుగా 100శాతం పనులను పూర్తి చేయడానికి ఆ దిశగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ లో భాగంగా నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివేన రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీటిని నింపడానికి ఆరు నెలల సమయం పెట్టుకొని, ఏమేమి పనులు చేయాలో, అదేవిధంగా ఉద్దండాపూర్ రిజర్వాయర్ నింపడానికి 2026 మార్చి వరకు నిర్దిష్ట గడువును నిర్దేశించుకుని ప్రణాళికబద్ధంగా పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మొదటి లిఫ్టులో నిరుపయోగంగా ఉన్న రెండు మోటార్లను రెండు మూడు నెలల్లో మరమ్మతులు పూర్తి చేసి వినియోగం లోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి ఉద్దండపూర్ రిజర్వాయర్ తో పాటు ఓపెన్ కెనాల్ పనులు పూర్తి చేసి సాగునీటిని అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయమై వనపర్తి నాగర్ ర్నూల్ జిల్లా కలెక్టర్లతో మంత్రులు చర్చించి అనేక విషయాలు తెలుసుకున్నారు. భచావత్ ట్రిబ్యునల్ లో ఉమ్మడి రాష్ట్రానికి 811 టిఎంసిలు కేటాయిస్తే తెలంగాణ లో సీఎం గా ఉన్న కేసీఆర్ వైఫల్యం వల్ల మన రాష్ట్రానికి 299 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్కు 512 టీఎంసీలు కేటాయించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందం చెల్లదని లిఖితపూర్వకంగా వాటర్ బోర్డ్ కు వివరించడం జరిగిందని ఆయన అన్నారు. నీటి కేటాయింపులు నదుల పరివాహక ప్రాంతం ప్రజలు సాగుభూములను దృష్టిలో పెట్టుకొని పంపకాలు చేయాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పదేళ్ల కాలంలో కృష్ణా నది నుండి ఏపీకి నీటిని తరలిస్తుంటే మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఆంధ్ర రాష్ట్రానికి సహకరించారని ఆయన మండిపడ్డారు. టిఆర్ఎస్ అసమర్థత వల్ల ఉమ్మడి నల్లగొండ మహబూబ్నగర్ ఖమ్మం జిల్లాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో ఖర్చు చేసిన లక్షల కోట్ల రూపాయలు కాకుండా తుమ్మడి హట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మించి ఉంటే పాలమూరు నల్లగొండ జిల్లాల భారీ ప్రాజెక్టులు ఇదివరకే పూర్తి అయ్యేవని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం లో నాయకుల ధన దాహం వల్ల అది ఉపయోగంలో లేకుండా పోయిందని ఆయన అన్నారు. పాలమూరు రంగారెడ్డి లో 25వేల కోట్లు ఖర్చు చేసి 15ల కాలంలో ఎకరా భూమికైనా నీరు ఇవ్వకపోవడం దౌర్భాగ్యం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి వారి జేబులు నింపుకున్నారని ఆయన అన్నారు. ఏ రాష్ట్రం ఎంత నీటిని వాడుకుంటుందో లెక్కల బోర్డు పెట్టడంలో కూడా నిర్లక్ష్యం వహించారని ఆయన అన్నారు. రాజీ లేకుండా మేడిగడ్డ లాంటి తప్పిదాలు పునరావతం కాకుండా పాలమూరు రంగారెడ్డిని నాణ్యవంతంగా నిర్మించి రైతులకు అంకితం చేస్తామని ఆయన భీమా వ్యక్తం చేశారు. ఎస్ ఎల్ బీసీ లో జరిగిన ప్రమాదం విషయంలో ఇప్పటికే రెండు మృతదేహాలను బయటకి తీశామని మరో ఆరు మృతదేహాలు బైటికి తేవడానికి అక్కడ ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున తీయలేకపోయామన్నారు. ఇప్పటికే కార్మికులను బయటికి తీసే విషయంలో ఉన్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే ఒక్కో కుటుంబానికి 25 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మంత్రుల వెంట ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బాదవత్ సంతోష్, మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

## మార్కెట్ కమిటీ చైర్మన్ గుండేటి గోపిక జితేందర్ రెడ్డి

వెల్గటూర్, మే 01(మనం న్యూస్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఆరోగ్యం లభిస్తుందని ఏఎంసి చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎండపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో వాలీబాల్,అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వాలీబాల్, అథ్లెటిక్స్ శిక్షణ



శిబిరాలు మే 1 నుండి 31 వరకు నిర్వహిస్తారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలోని విద్యార్థులు శిక్షణ తీసుకొని రానున్న రోజుల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో మంచి ప్రతిభను కనబరచాలని సూచించారు.ఈ సందర్భంగా డిస్టిక్ స్పోర్ట్స్ ఆఫీసర్ మరియు అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మారంపల్లి కృష్ణారెడ్డి మారేపల్లి రవీందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి వాలీబాల్ కోచ్ బైకనీ కొమురయ్య అథ్లెటిక్స్ కోచ్ బైకని శివమణి సబ్బు సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐఎన్టీయూసీ కార్యాలయంలో మేడే వేడుకలు



మంచిర్యాల, మే1(మనం న్యూస్): మేడే కేవలం ఒక సాధారణమైన రోజు కాదని, శ్రమించే ప్రతి గుండె చప్పుడు, పోరాడే ప్రతి ఆత్మ గర్జన రోజని , ఇది తరతరాల కార్మికుల కలలు, ఆకాంక్షలు, వారి అలుపెరగని పోరాటాల సజీవ సాక్ష్యం మని ఐఎన్టీయూసీ సెంట్రల్ నాయకుడు, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు కొనియాడారు. గురువారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియ లోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో మేడే వేడుకలను జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో ఘనగా నిర్వహించారు . కొబ్బరి కాయలు కొట్టి చికాగో అమర వీరులకు నివాళులు అర్పించారు. యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగ స్వామిమేడే జండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ, నేడు, మనం ఇక్కడ నిలబడి ఉన్నామంటే, లక్షలాది మంది తమ చెమటతో, రక్తంతో ఈ సమాజానికి పునాదులు వేశారనేది మరచిపోకూ డదని, వారి కఠోర శ్రమ లేకపోతే, ఈ వైభవం లేదు, ఈ దేశ ప్రగతి లేదు. వారి చేతులే కర్మాగారాలను నడిపించాయి, పొలాలను దున్నాయి, భవనాలను నిర్మించాయి. వారి శ్వాసే ఈ సమాజానికి జీవం పోసిందన్నారు .కానీ, ఒకసారి మన చుట్టూ నిశితంగా పరిశీలించండని నేటికీ ఎంతమంది కార్మికులు కనీస వేతనం కోసం పోరాడుతున్నారు, ఎంతమంది సురక్షితమైన పని పరిస్థితులు లేక ప్రాణాలు కోల్పోతున్నారు, ఎంతమంది తమ హక్కుల కోసం గొంతెత్తడానికి భయపడు తున్నారు అనే ఈ ప్రశ్నలు మనల్ని కలవరపరుస్తున్నా యన్నారు మే డే కేవలం గతించిన పోరాటాల జ్ఞాపకం కాదని, ఇది భవిష్యత్తు కోసం మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుందని, మన చుట్టూ ఉన్న అణగారిన వర్గాల కోసం మనం గళం విప్పాలని, వారి హక్కుల కోసం మనం పోరాడాలని సమానత్వం, న్యాయం, గౌరవం అనే పునాదులపై ఒక నూతన సమాజాన్ని నిర్మించాలన్నారు. మనమంతా ఒకే తాటిపై నిలబడాలి. కులం, మతం, ప్రాంతం అనే భేదాలను విస్మరించి, కార్మికులుగా మనం ఒక్కటి కావాలి. మన ఐక్యతే మన బలం. మన సంఘీభావమే మన ఆయుధమని, ఏ ఒక్క కార్మికుడు అన్యాయానికి గురికాకుండా చూసుకుంటామని. ప్రతి ఒక్కరికి గౌరవంగా జీవించే హక్కు ఉందని చాటిచెబుదామని, ఒక బలమైన, సమగ్రమైన, మానవత్వం కలిగిన ప్రపంచాన్ని నిర్మించగలమని నిరూపిద్దామన్నారు. ఈ కార్య క్రమంలో కలవేని శ్యామ్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ , ల్యాగాల శ్రీనివాస్ సెంట్రల్ సెక్రెటరీ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, బ్రహ్మాచారి ,పేరం రమేష్ గారు జీవన్ జోయల్ , భీమ్ రవి, మెండే వెంకటి, తిరుపతి, నీలం సదయ్య, , రౌతు సత్యనారాయణ, పొద్దున మల్లేష్, శ్రీకాంత్, నరసింహ రావు, ఇండ్ల కిరణ్, ప్రవీణ్, మేదరి మహేందర్, తిరుపతి లు పాల్గొన్నారు.



# ప్రెస్ క్లబ్ అధ్యక్షుని తొలగింపు

## త్వరలో నూతన అధ్యక్షుని ఎంపిక

రామకృష్ణాపూర్,మే 1 ( మనం న్యూస్): క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ నుంచి కలువల శ్రీనివాస్ ను అధ్యక్ష పదవి నుండి తొలగిస్తున్నట్లు క్లబ్ ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్ తెలిపారు.గురువారం క్లబ్ సభ్యులు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కలువల శ్రీనివాస్ క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా కొనసాగుతూ క్లబ్ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన వ్యక్తిగత స్వార్థంతో ప్రెస్ క్లబ్ ను వేరే క్లబ్ లో విలీనం చేస్తున్నట్లు ఇటీవల చేసిన ప్రకటనను క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు.ఈ విషయంపై బుధవారం మంచిర్యాల జిల్లా టియుడబ్ల్యూజే అధ్యక్షులు డేగ సత్యనారాయణ ను మర్యాద పూర్వకంగా కలిసి వారికి వినతిపత్రం అందజేశామని తెలిపారు.ఈ విషయంపై సానుకూలంగా స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.త్వరలో క్లబ్ నూతన అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని,పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు రాజకీయ పార్టీలు గమనించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పరికిపండ్ల రాజు,ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్,ప్రచార కార్యదర్శి రామిడి సాయి సృజన్,సంయుక్త కార్యదర్శి పోలు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పది ఫలితాల లో వసంత్ వ్యాలీ' విద్యార్థుల ప్రభంజనం



కరీంనగర్, మే1(మనం న్యూస్): కరీంనగర్ హనుమాన్ నగర్ లోని వసంత్ వ్యాలీ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించారని వసంత్ వ్యాలీ పాఠశాల చైర్మన్ ఎ. బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిరంతరం అత్యుత్తమ విద్యను అందించడం లక్ష్యంతో విద్యార్థులు దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు విద్యలు క్షుణ్ణంగా చదవడం అలవాటు చేస్తున్నామని అన్నారు. అందుకే విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో వంగల అక్షయ 576, వెల్మరెడ్డి అక్షత్ రెడ్డి, బండ అంకిత 567 మార్కులు సాధించారన్నారు.550 మార్కుల పైన 20 మందికి వచ్చాయని పేర్కొన్నారు. బి, వినయ్ 565 పి, సంకీర్తన 562 బి, అక్షిత 562 బి, రిచిత 561 పి, వివేక్ 560 సి ,కార్తీక్ 558 జి, శ్రీ వైష్ణవి 558 ఎస్ ,అక్షిత 557 వి, అవినాష్ 557 పి, హర్షిత 557 కే ,కౌశల్ 556 కే, ధరణి 554 ఎం, శ్రీజ 553 బి, భవ్యశ్రీ 552 వి, శ్వేత 551 వి,తమల్ 551, తిరుమల్ రెడ్డి 551 సాధించి ప్రతిభను కనబడుచారు.ఈ సందర్భంగా విద్యార్థులను వసంత్ వ్యాలీ కరస్పాండెంట్ ఏ స్వరూప బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# ఆరోగ్యమైన యువతనే దేశానికి రక్ష

- ఎమ్మెల్సీ వాణిదేవి



సైదాపూర్, మే1(మనం న్యూస్): డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రలో భాగంగా గురువారం సైదాపూర్ మండలం లో వెన్నంపల్లి, సోమారం,లస్మన్నపల్లి , ఆరెపల్లి,ఎక్లాస్పూర్, దుద్దెనపల్లి గ్రామాలలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కొనసాగింది . దుద్దెనపల్లిలో జరిగిన అవగాహన సభలో ఎమ్మెల్సీ వాణి దేవి పాల్గొని ప్రసంగించారు. స్వామి వివేకానంద పేర్కొన్నట్లుగా ఆరోగ్యమైనటువంటి యువతననే దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉన్నది దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్,రాజుగుర్, సుఖదేవ్ లాంటి యువతను నేటి యువత ఆదర్శంగా తీసుకుని స్వంతంగా ఎదుగుతూ దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పేర్కొన్నారు. అలాంటి యువత మత్తుకు మద్యానికి ఇతర చెడు వ్యసనాలకు బానిసలై అర్థాంతరంగా చనిపోవడం రాను రాను దేశంలో యువత యొక్క సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదము ఉందని విచారం వ్యక్తం చేసినారు యువత లేని దేశం వృద్ధాప్యంతో ఉన్న ముసలి వాళ్ళ శత్రుదేశాలకు ఒక అవకాశం కల్పించిన వాళ్ళం అవుతాము చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్క వారసులమైన మహిళలమే మన పిల్లలను చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా డ్రగ్స్ లాంటి మత్తు మహమ్మారిని మన గ్రామాల్లోకి రాకుండా పోరాటం చేసి యువతను కాపాడి ఈ దేశం యొక్క సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని మన మహిళ లోకాన్ని కోరుచున్నాను.ఈ కార్యక్రమంలో ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామి, జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జెఏసి కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య,ఎదులాపురం తిరుపతి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్,ఎమ్మార్పీస్ నాయకులు మాట్ల వెంకటస్వామి మాదిగ, జేఏసీ మండల మహిళ నాయకురాలు గాండ్ల పద్మ, బిసి సంఘం నాయకులు వేముల జగదీష్, పెట్టం కుమారస్వామి, తాళ్ల పెల్లి ఆశీర్వాదం, తాళ్ల పెల్లి ప్రభాకర్, పోలు ప్రవీణ్ బీసీ నాయకులు, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బిల్ల వెంకట్ రెడ్డి,పెసరు కుమారస్వామి, రాజిరెడ్డి, సోమారపు రాజయ్య ,తాటి పెల్లి యుగంధర్, మట్టెల రవీందర్, ఆడేపు రాజేందర్, మండల సమైక్య అధ్యక్షురాలు సొమ్ము రజిత, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెను విరమించండి

- తె.యూ వైస్ ఛాన్సలర్ యాదగిరి రావు
- పి.టి.ఎల్ ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం సానుకూలం
- సమ్మెను విరమింపజేసిన వీసీ యాదగిరి రావు



**కామారెడ్డి, మే 1 (మనం ప్రతినిధి):** స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం లెక్చరల్ అసోసియేషన్ పిలుపు మేరకు గత పది రోజులుగా రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో నిరవధిక సమ్మెను చేస్తున్న పి.టి.ఎల్ (పార్ట్ టైం లెక్చరర్) అధ్యాపకుల సమ్మెలో బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కళాశాలలో చేపట్టిన మహా ధర్నా విజయవంతమై ప్రభుత్వం దృష్టికి పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పలువురు ప్రజా ప్రతినిధుల, నాయకుల నుండి వెళ్ళగా ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి ద్వారా ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిచ్పల్లి, భిక్కనూర్, సారంగాపూర్ క్యాంపస్ లోని పార్ట్ టైం అధ్యాపకులు నిరవధిక సమ్మెలో పాల్గొనగా, తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యదగిరిరావు పార్ట్ టైం అధ్యాపకుల సమ్మె టెంట్ వద్దకు వచ్చి ప్రభుత్వం మీ సమస్యలపై సానుకూలంగా స్పందించిందనీ, త్వరలోనే మీ సమస్యలు పరిష్కారం అవుతాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ తమకు తెలిపారని అన్నారు. పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడంలో నేనెప్పుడూ ముందుంటానని వీసీ తెలిపారు. కావున మీరు సమ్మెను విరమించి విధులలో చేరాలని వారిని కోరారు. ఈ సందర్భంగా తె.యూ పార్ట్ టైం అధ్యాపకులు మాట్లాడుతూ., గత పది రోజులుగా నిరవధిక సమ్మెకు సహకరించిన అన్ని యూనివర్సిటీల పార్ట్ టైం అధ్యాపకులకు, అందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

# సిపిఐ, ఏఐటీయుసి ఆధ్వర్యంలో ఘనంగా మే డే

**బాన్సువాడ, మే 01 ( మనం న్యూస్ ):** బాన్సువాడ పట్టణంలోని సిపిఐ కార్యాలయం ముందు గురువారం కార్మిక వర్గ పోరాట దినం మే డే ను సిపిఐ, ఏఐటీయుసి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ రాములు మే డే జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ., ఆనాడు కార్మికులు ఎనిమిది గంటల పని దినం కావాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని, వెట్టి చాకిరిని నిర్మూలించాలని కార్మికులను యంత్రాలలగా కాకుండా మనుషులాగా చూడాలని డిమాండ్లతో 1886వ సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో సమ్మె చేస్తున్న కార్మికులపై యజమాన్యాలు పోలీసులతో కార్మికులపై తుపాకీతో కాల్పులు జరపడం వలన ఎంతోమంది అమరులయ్యారని వారి రక్తంతో తడిసిన గుడ్డలతోనే కార్మికులు ఎర్రజెండా ఎగిరేసారని ఆయన తెలిపారు. కార్మిక వర్గ పోరాట ఫలితమే కార్మిక చట్టాలు అమల్లోకి వచ్చాయని ఆయన తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో



ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను ఖాలరాస్తుందని ఆయన విమర్శించారు. మే డే స్ఫూర్తితో కార్మికుల చట్టాలను కాపాడుట కోసం కార్మికులు ఐక్యంగా ఉండి ఉద్యమాలకు సిద్ధంగా కావాలని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి డి శంకర్ మాట్లాడుతూ., కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేస్తేనే వారి యొక్క సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. పాలకులు మన సమస్యలను పట్టించుకోరని కార్మిక వర్గం ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తోటపల్లి శ్రీనివాస్, శివాజీ, రాజు, కుమార్ దేవాంగ, కమ్మరి రాములు, కొత్త సాయిలు, గంపల సాయిలు, ఒడ్డు సాయిలు, ఓల్లెపు గంగాధర్, మొగులయ్య, హనుమాన్లు, కృష్ణ, పోశెట్టి, నాగమణి, రాపర్తి సాయిలు, పుట్టి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# భారత్‌తో యుద్ధం అంటే..పాక్ వెనుకంజే

- 1993లో సీఐఏ పత్రం వెల్లడి

భారత్‌తో ఉద్రిక్తతలు మొదలైతే.. పాక్ వెనుకంజ వేస్తుందని 1993లో సీఐఏ పత్రం ఒకటి పేర్కొంది. అంతేకాదు.. న్యూఢిల్లీ అభివృద్ధి ఇస్లామాబాద్‌ను ఆందోళనకు గురి చేస్తుందని వెల్లడించింది.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో భారత్ 36 గంటల్లో తమపై దాడి



చేస్తుందని పాక్ సమాచార మంత్రి అతావుల్లా తరార్ పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ పరిస్థితుల్లో 1993లో భారత్-పాక్ సంబంధాలపై అమెరికా నిఘా సంస్థ ఓ రహస్య అంచనాలు ప్రచురించింది. ఇస్లామాబాద్‌కు న్యూఢిల్లీ అంటే లోలోపల ఉన్న భయాలను దీనిలో వెల్లడించింది. నేషనల్ ఇంటెలిజెన్స్ ఎస్టిమేట్ (ఎన్ఐఈ) ఇరు దేశాల సంబంధాలను పరిశీలించి ఈ పత్రాన్ని తయారు చేసింది. ఒక వేళ యుద్ధం మొదలైతే.. దానికి కశ్మీర్ కారణంగా ఉంటుందని అంచనావేసింది. పాకిస్థాన్ ఆ సమయంలో కచ్చితంగా వెనుకంజ వేస్తుందని తెలిపింది.

**1993 అంచనాలు ఇవి..**

నాడు ఎన్ఐఈ సీఐఏకు పనిచేసే బ్రూస్ రీడెల్ నేతృత్వంలో ఈ పత్రాన్ని సిద్ధం చేశారు. నాటికి భారత్‌లో బాబ్రీ మసీద్ ఘటన చోటు చేసుకోగా.. పాక్ అంతర్గత కలహాలతో సతమతమవుతోంది. అణ్వాయుధాల విషయం ఇంకా బాహ్యప్రపంచానికి తెలియలేదు. నాడు సీఐఏ అంచనా ప్రకారం ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరగడానికి 20శాతం అవకాశం ఉంది. దీనికి తప్పుడు అంచనాలు, కవ్వింపు చర్యలు, ప్రతిచర్య, పెద్ద ఉగ్రదాడి, సైనిక విన్యాసాలపై అపోహలు, హఠాత్తుగా చెలరేగే మత విద్వేషాలు వంటివి కారణం కావచ్చని పేర్కొంది.

ఇక ఇటు భారత్ కానీ అటు పాకిస్థాన్ కానీ యుద్ధం కోరుకోవడంలేదని ఆ పత్రం వెల్లడించింది. కానీ, భారత్ ఎదుగుదలను చూసి పాక్ నిర్ఘాంతపోయి.. కశ్మీర్‌లో వేర్పాటువాద శక్తులతో చేతులు కలపడం, ఉగ్రవాదులతో జట్టు కట్టడం వంటి చేసే అవకాశం ఉందని వెల్లడించింది. కశ్మీర్‌ను వేరు చేసేందుకు సాయుధ ఉగ్రమూకలకు శిక్షణ, ఆయుధాల సమకూర్చడం వంటివి చేస్తుందని పేర్కొంది.

**పాక్ వ్యూహాత్మక భయం..**

అప్పటికే ఆధిపత్యం భారత్ వైపు మొగ్గిందని పేర్కొంది. ఆర్థికంగా, సైనిక పరంగా, దౌత్యపరంగా న్యూఢిల్లీ వేగంగా ఎదుగుతోందని అభివర్ణించింది. ఇరు దేశాల మధ్య ఆ అంతరాన్ని పాక్ అందుకోలేదని వెల్లడించింది. ఆ సమయంలో భారత్‌కు కేవలం అంతర్గత సమస్యలు, ఆర్థిక వృద్ధి సవాలుగా ఉంది. నాడు పీవీ నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఇక పాకిస్థాన్ మాత్రం సైనిక పాలన, రాజకీయ అస్థిరత, ఆర్థిక పతనం మధ్య ఊగిసలాడుతోంది. ఆ దేశంలో భయంతోనే.. కశ్మీర్‌లో విద్వేషాలను మరింత ఎగదోసింది.

ఇక ఈ పత్రం కేవలం సీఐఏ మాత్రమే విశ్లేషించకుండా శ్వేతసౌధం, విదేశాంగశాఖకు బ్రీఫింగ్స్ ఇచ్చేందుకు వినియోగిస్తారు. బిల్ క్లింటన్ హయాం నుంచి దక్షిణాసియాకు ప్రాధాన్యం పెరిగింది. 2000 సంవత్సరంలో బిల్ క్లింటన్ స్వయంగా భారత్‌లో పర్యటించారు. నాడు కశ్మీర్‌లోనిని ఛత్తీసింగ్‌పురాలో ఉగ్రదాడి జరిగింది. 35 మంది గ్రామీణ సిక్కులను ఉగ్రవాదులు పొట్టనపెట్టుకొన్నారు. ఇరు దేశాల మధ్య హాట్‌లైన్ , న్యూక్లియర్ ఒప్పందాల వంటివి ప్రయోజనకరమైనా.. అసలైన సంక్షోభాల్లో అవి పెద్దగా ఉపయోగపడవని సీఐఏ పేర్కొంది. ఒక్కసారి హింస మొదలైతే నాయకులు తమ సహజశైలిలోనే స్పందిస్తారని.. ప్రొటోకాల్స్ ప్రకారం కాదని సిఐఏ వెల్లడించింది.

# ఐఎస్ఐ చీఫ్‌కు జాతీయ భద్రతా సలహాదారు బాధ్యతలు

**ఇస్లామాబాద్,మే 1:** పహల్గాం దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఉగ్రదాడికి ప్రతీకారంగా తమపై న్యూఢిల్లీ ఏ క్షణమైనా దాడులు చేపట్టొచ్చని పాక్ భయపడుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ ఆసిమ్ మాలిక్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను జాతీయ భద్రతా సలహాదారుగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అధికారిక నోటిఫికేషన్ కూడా జారీ చేసినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. మాలిక్‌కు ఎన్ఎస్ఏ చీఫ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆయనను గతేడాది సెప్టెంబరులో ఐఎస్ఐ చీఫ్‌గా నియమించారు. నిఘా సంస్థ అధిపతి కంటే ముందు.. పాక్ ఆర్మీ జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో అడ్జుటంట్ జనరల్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మిలిటరీ అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలను పర్యవేక్షించారు. పాక్ సైన్యంలో మాలిక్ అడ్జుటంట్ జనరల్‌గా పనిచేస్తున్నప్పుడే మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు.. ఆయన మద్దతుదారుల ఆందోళనలపై ఆర్మీ అణచివేత వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో బలోచిస్థాన్, దక్షిణ వజీరిస్థాన్‌లో ఆర్మీ డివిజన్లకు నాయకత్వం వహించారు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని కఠినంగా ముందుకుసాగుతాడని మాలిక్‌కు పేరుంది. అలాంటి వ్యక్తికి ఇప్పుడు జాతీయ భద్రతా సలహాదారుగా పాక్



అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం దాడికి పాక్ సీమాంతర ఉగ్రవాదమే కారణమన్న భారత్.. దాయాదితో దౌత్య సంబంధాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఇటీవల త్రివిధ దళాలతో కీలక సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ.. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని' అని స్పష్టం చేసినట్లు సమాచారం. మరోవైపు, ఉద్రిక్తతల వేళ సరిహద్దుల్లో అలజడి కొనసాగుతూనే ఉంది. వరుసగా ఏడో రోజు నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఉరి, కుప్వారా, అఖ్నూర్ సెక్టార్‌లో భారత్ ఆర్మీపై కాల్పులు జరిపింది. దీన్ని భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. సరిహద్దుల్లో కొనసాగుతున్న కవ్వింపులపై పాకిస్థాన్‌ను భారత్ గట్టిగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. భారత మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్, పాక్ సైనిక డైరెక్టర్ జనరల్ మంగళవారం హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు.

# అనుమానస్పద స్థితిలో మహిళ మృతి

**కామారెడ్డి క్రైమ్, మే 01 ( మనం న్యూస్ ):** వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు గ్రామస్తులు



అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామానికి చెందిన చిదుర కవిత(35) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన కవిత రాత్రయినా ఇంటికి రాకపోయే సరికి వెళ్లి చూడగా చెట్టుకు చీరతో ఉరేసుకున్నట్టుగా వేలాడుతున్న కవిత మృతదేహం కనిపించింది. కవిత ఒంటిపై పుస్తెల తాడు, బంగారు ఆభరణాలు, కాళ్ల కడియాలు కనిపించడం లేదని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కవిత గొంతుపై గాయం ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి ఆభరణాలు దోచుకుని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆ బంగారం ఆమె ఆస్తి

- విడాకుల తర్వాత తిరిగివ్వాల్సిందే..!
- కేరళ హైకోర్టు కీలక తీర్పు

**తిరువనంతపురం, మే 1:** వివాహ సమయంలో వధువుకు ఇచ్చే బంగారం ఆమెకు చెందిన ఆస్తే అని కేరళ హైకోర్టు పేర్కొంది. ఒక విడాకుల కేసులో కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహం సమయంలో వధువుకు బహుమతిగా ఇచ్చే బంగారం, నగదును ఆమె ప్రత్యేక ఆస్తి లేక స్త్రీధనంగా పరిగణించాలంటూ తీర్పు వెలువరించింది. విడాకుల విచారణలో భాగంగా తన బహుమతులు, ఆభరణాలు తిరిగి ఇప్పించాలంటూ ఆమె చేసిన అభ్యర్థనను కిందికోర్టు తిరస్కరించింది. దాంతో ఆ తీర్పును ఆమె హైకోర్టులో సవాలు చేశారు.

ఎర్నాకుళంలోని కలమస్సేరికి చెందిన ఒక మహిళకు 2010లో వివాహం జరిగింది. ఆ సమయంలో తన కుటుంబం, బంధువుల నుంచి 71 సవర్ల (ఒక సవర అంటే 8 గ్రాములు) బంగారం అందిందని ఆమె వెల్లడించారు. మంగళసూత్రం, ఒక




గాజు, చేతికి ఉన్న రెండు ఉంగరాలు మినహా మొత్తం బంగారన్నంతా భద్రపరుస్తామన్న నెపంతో అత్తింటివారే తమ వద్ద దాచిపెట్టుకున్నారని చెప్పారు. అయితే అదనపు కట్నం కింద తన భర్త అడిగిన రూ.5లక్షలు ఇవ్వకపోవడంతో తమ బంధం బీటలు వారిందని తెలిపారు. తన తల్లిదండ్రుల ఫిక్స్‌డ్ డిపాజిట్లతో ఆ బంగారాన్ని కొనుగోలు చేసిన విషయాన్ని ఆమె కోర్టులో నిరూపించుకోగలిగారు. వాదోపవాదాలు విన్న కేరళ హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పును వెలువరించింది. విడాకుల ప్రక్రియలో భాగంగా మిగిలినది పోనూ 59.5 సవర్ల బంగారం లేక దాని ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నగదు చెల్లించాలని ఆమె భర్త కుటుంబాన్ని ఆదేశించింది.

అయితే ఆమె బంధువులు పెట్టిన బంగారానికి, పెళ్లి సమయంలో ఇచ్చిన గృహోపకరణాలకు ఆధారాలు చూపలేకపోవడంతో.. ఆ మేరకు ఆమె చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అయితే ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''వివాహ సమయంలో వధువుకు వచ్చే బంగారాన్ని భద్రపరుస్తామనే ముసుగులో లేక ఆచారాల్లో భాగంగా భర్త లేక అతని కుటుంబం తమ వద్ద ఉంచుకుంటుంది. ఇలాంటి బదిలీల విషయంలో రాతపూర్వకంగా ఎలాంటి రికార్డు ఉండకపోవడంతో దానిని ఆమె తిరిగి తీసుకునే అవకాశాలు పరిమితమే.

గృహహింస, వరకట్న వేధింపులు లేక విడాకుల వంటి పరిస్థితి తలెత్తినప్పుడు దానిని వెనక్కి తీసుకోవడం మరింత సమస్యాత్మకంగా మారొచ్చు. ఆమె బంగారాన్ని అత్తింటివారికి ఇచ్చినప్పుడు రసీదులు వంటివి ఉండకపోవడం వల్ల అది తనదే అని ఆమె నిరూపించుకోవడం కష్టంగా మారుతుంది. న్యాయస్థానాలు ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి. క్రిమినల్ కేసుల్లో మాదిరిగా చట్టపరమైన సాక్ష్యాలు కావాలని ఒత్తిడి చేయలేం'' అని వ్యాఖ్యానించింది.

# భారత్-పాక్ సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం

**అమృత్‌సర్, మే 1:** భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉగ్ర కుట్ర భగ్నమైంది. అమృత్‌సర్ సమీపంలో బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు




సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సరిహద్దులో ఇలా ఆయుధాలు పట్టుబడటం కలకలం రేపుతోంది.

బీఎస్ఎఫ్ ఇంటిలిజెన్స్ వింగ్ సమాచారం మేరకు ఏప్రిల్ 30 సాయంత్రం ఈ ఆపరేషన్ నిర్వహించారు. దానిలోభాగంగా ఆయుధాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. దీనిపై తదుపరి దర్యాప్తు నిర్వహించనున్నారు. బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు అత్యంత వేగవంతంగా, సమన్వయంతో వ్యవహరించడంతో ఈ ఉగ్ర కుట్ర భగ్నమైంది. ఇదిలాఉంటే.. బంగ్లా సరిహద్దులో కూడా పాక్ ఐఎస్ఐ కలకలం సృష్టించినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల కాలంలో మహమ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చాక.. ఢాకా-ఇస్లామాబాద్‌ల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యాయి. దీంతో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, మిలిటరీ అధికారులు బంగ్లాదేశ్‌లోని భారత్ సరిహద్దుల వైపునకు రావడం పెరిగింది. ఆ దేశంలోని ర్యాడికల్ గ్రూప్స్‌తో కూడా పాక్ సంబంధాలు పెట్టుకొంటోంది. ఈ నేపథ్యంలో బంగ్లా-భారత ర్యాడికల్ గ్రూపులను పాకిస్థాన్ వాడుకొనే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో భద్రతా ఏజెన్సీలు బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లోని పోస్టులపై దృష్టిపెట్టాయి.

# రామ్దేవ్ బాబా వ్యాఖ్యలపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం

**ఢిల్లీ, మే 1:** యోగా గురువు రాందేవ్ బాబాపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్‌దర్ద్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్ విచారిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసింది.



''ఎవరి నియంత్రణలో లేకుండా ఆయన తన సొంత ప్రపంచంలో జీవిస్తున్నారు'' అని పేర్కొంది. ఏప్రిల్ 22న జరిగిన విచారణలో భాగంగా హమ్‌దర్ద్ ఉత్పత్తులపై భవిష్యత్తులో ఎలాంటి ప్రకటనలు జారీ చేయొద్దని, వీడియోలు షేర్ చేయొద్దని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అలాగే ఆ తరహా వ్యాఖ్యలు షాక్ గురిచేశాయని తీవ్రంగా స్పందించింది. అవి ఏమాత్రం సమర్థనీయం కాదని తేల్చిచెప్పింది.

గతంలో తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యవహారంలో పతంజలి ఆయుర్వేద్ సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా , ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటనల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కూడా జరిగింది. ఇకపై అలాంటి ప్రకటనలు ఇవ్వబోమని వారు కోర్టుకు విన్నవించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.

# భవనం పై నుండి దూకి మహిళ ఆత్మహత్య

**కామారెడ్డి క్రైమ్, మే 01 ( మనం న్యూస్) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పూజిత అనే వివాహిత (20)



రెండంతస్తుల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. గత ఏడు నెలల క్రితం సాయికుమార్ అనే వ్యక్తితో పూజితకు వివాహం జరిగిందని తెలిపారు. పూజిత ఆత్మహత్యకు భర్త వేధింపులే కారణమంటూ పూజిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పెళ్లయిన నాటి నుంచి తరచూ భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించి, పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఖనిజాల ఒప్పందంపై సంతకం చేసిన ఉక్రెయిన్-అమెరికా

**వాషింగ్టన్,మే 1:** ఉక్రెయిన్-అమెరికా మధ్య ఎట్టకేలకు అరుదైన ఖనిజాల తవ్వకాల ఒప్పందం కుదిరింది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్, ఉక్రెయిన్ ఫస్ట్ డిప్యూటీ ప్రధాని యులియా స్విర్దెంకో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో ఉక్రెయిన్‌లో అరుదైన సహజ వనరులు అయిన అల్యూమినియం, గ్రాఫైట్, చమురు, సహజ వాయువు, ఇతర ఖనిజాలను తవ్వుకునేందుకు అమెరికాకు అనుమతి లభించినట్లైంది.

ఈ ఒప్పందం కుదరడం వల్ల ఉక్రెయిన్‌లో అమెరికా సంయుక్త నిధిని ఏర్పాటు చేయనుంది. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి చేపట్టాల్సిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల్లో యూఎస్ పెట్టుబడిదారులకు ప్రాధాన్యత లభించనుంది. ఈ ఒప్పందం కుదరడంపై అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో



పోస్టు చేసింది. ''ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి కావాల్సిన ఉమ్మడి పెట్టుబడి నిధిని స్థాపించడానికి ఉక్రెయిన్, అమెరికాలు సంతకం చేశాయి. స్వేచ్ఛాయుత, సార్వభౌమ, సంపన్నమైన ఉక్రెయిన్ కోసం ట్రంప్ నిబద్ధతను ఈ చరిత్రాత్మక ఆర్థిక భాగస్వామ్యం సూచిస్తుంది'' అని తెలిపింది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు తాము చొరవ తీసుకుంటామని, అందుకు బదులుగా ఉక్రెయిన్‌లో ఖనిజాల తవ్వకానికి తమను అనుమతించాలని యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేయాల్సి ఉండగా, ఓవల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య మీడియా ముందే మాటల యుద్ధం జరిగింది. దీంతో అప్పటినుంచి ఇది అలాగే ఉండిపోయింది. అయితే ఈ ఒప్పందం కోసం ఇరుదేశాలు చాలా రోజులుగా తెరవెనుక ప్రయత్నాలు సాగించాయి. ఎట్టకేలకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

# భారత్- పాక్ల మధ్య ఉద్రిక్తతలు

- ఫరుక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ,మే 1:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. కశ్మీర్‌లోని భద్రతా, ఇంటెలిజెన్స్ లోపాలను ఆయన ఎత్తి చూపారు. ''రేపటి రోజు ఎలా ఉండబోతుందో ఎవరికీ తెలియదు. ఇరుదేశాలు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. అలా జరగకుండా ఉండాలంటే పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కారణమైన ఉగ్రవాదులు, దాని వెనక ఉన్న వారిని వీలైనంత తొందరగా పట్టుకోవాలి. యుద్ధాన్ని నివారించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భద్రతా, ఇంటెలిజెన్స్‌లో ఉన్న లోపాలు కూడా ఉగ్రదాడి జరిగేందుకు కారణమని అనడంలో సందేహం లేదు'' అని మీడియా సమావేశంలో ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. దేశం విడిచి వెళ్లిపోవాలని భారత్‌లోని పాక్ జాతీయులకు భారత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అందుకు గడువు కూడా విధించింది. ఇప్పటివరకు 780 మందికి పైగా దేశం విడిచి వెళ్లిపోయారు.

# ఘనంగా 139 వ మే డే ఉత్సవాలు

- **సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రమేష్ కుమార్**



**బేతంచేర్ల, (మనం న్యూస్):** పట్టణం సిఐటియు కార్యాలయం వద్ద 139 వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది బేతంచర్ల పట్టణంలో సిఐటియు కార్యాలయం భవానిర్మాణ కార్మిక సంఘం డ్రైవర్స్ కాలనీ అంగళ్ళ బజార్ ఇసుక హ మాలి ఫ్లాట్ ఫామ్ హమాలి సంత మార్కెట్ పట్టణంలో పలుచోట్ల మరియు ఆర్ఎస్ రంగాపురం సిమెంటు నగర్ కొలుములపల్లి గ్రామాలలో సిఐటియు జెండా ఆవిష్కరించారు స్థానిక లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ట్రాన్స్పోర్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు గౌరవ అధ్యక్షులు ఎస్ సాధిక్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రమేష్ కుమార్ మాట్లాడుతూ కార్మికులతో ఆనాడు కట్టు బానిసలుగా శ్రమ దోపిడీ జరుగుతున్న తరుణంలో కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం కావాలని 1886లో అమెరికాలోని చికాగో నగరంలో హే మార్కెట్లో పెట్టుబడిదారులకు కార్మికులకు జరిగిన పోరాటంలో అమరులైన కార్మికుల రక్తతర్పణంతో ఉద్భవించినదే ఈ మేడే దినోత్సవం అనగా ప్రపంచ కార్మికుల దినోత్సవం అని వారన్నారు ఆనాడు కార్మికుల రక్త తర్పణముతో సాధించిన ఈ మేడే ప్రపంచవ్యాప్తంగా కార్మికుల దినోత్సవం గా పిలవబడుతుందని అన్నారు అయితే ఈనాడు పెట్టుబడిదారులు వారి స్వలాభాల కోసం 8 గంటల పని విధానాన్ని రూపుమాపేందుకు పాలక ప్రభుత్వాలను తమ చెప్పు చేతల్లో ఉంచుకొని కార్మిక శ్రామికులతో శ్రమ దోపిడీ చేయించడానికి ఎన్నో కుట్రలు పడుతున్నారని అన్నారు కార్మికులు దశాబ్దాల కాలంగా పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారులకు వచ్చిన ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు కేవలం నాలుగు లేబర్ కోడ్ లు చేసి మరల కార్మికులను కట్టు బానిసలుగా చేసే జీవోలు జారీ చేయడం చాలా దారుణం అని అన్నారు రైతుల హక్కులను కాల రాసేందుకు కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను అమలులోకి తీసుకొని వచ్చి రైతులకు వారు పండించిన పంటలపై హక్కు లేకుండా చేసినందుకు గాను దాదాపు 700 రోజులకు పైగా అనేక ఉద్యమ పోరాటం చేసి వందల సంఖ్యలో ప్రాణాలు అర్పించి కేంద్ర మెడల్వంచి కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేసే విధంగా మహోత్తరమైన ఉద్యమంతో సాధించిన నేపథ్యంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులహ కన్నీళ్లు తురచడానికి నల్ల చట్టాలు రద్దు చేసినట్లుగా వ్యవహరించి మరలా దొడ్డి దారిన అమలు చేయడానికి పూలు కోవడం సరైంది కాదన్నారు కేంద్ర రాష్ట ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు ఈనెల 20వ తేదీ జరగబోతున్న దేశ యాత్ర సమ్మె పాలక ప్రభుత్వాలకు కను మనస్థాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారని వారి కుటుంబాలు రోడ్డులో పడిన పరిస్థితులకు త్వరలో కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు బేతంచర్ల నగర పంచాయతీలో దాదాపుగా 100కు పైగా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య విద్యుత్తు వాటర్ మెన్ ఆఫీస్ సిబ్బంది కార్మికులకు నాలుగు నెలలైనా జీతాలు ఇవ్వకపోవడం గత రెండు సంవత్సరాల క్రితం 10 కార్మిక రంగంలో పనిచేసే వారికి నెలకు 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు జీవోలు జారీ చేసిన ఈ పాలకవర్గాలు పెడచెవిన పెడుతూ నిర్లక్ష్యంగా కార్మిక వ్యవస్థలు ముప్పు తిప్పలు పెడుతూ బెదిరింపులకు గురి చేయడం సరైనది కాదని అన్నారు పాలకవర్గాలకుఅందుకే చిరు ఉద్యోగులు స్కీం వర్కర్లు సంఘటిత ఆ సంగటిత కార్మికులందరూ ఐక్య పోరాడకు సిద్ధం కావాలని ఈనెల 20వ తేదీ జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు అనంతరం చిన్నారులతో నిర్వహించిన సాంస్క ృతిక కార్యక్రమాలు కార్మికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు జి శేబారాణి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎం మధు శేఖర్ ఆశ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ పుష్పావతి అంగన్వాడి పట్టణ మరియు మండల కార్యదర్శులు లారీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు ఎస్ కా జా హుస్సేన్ ఆట వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఏ మద్దిలేటి స్వామి హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు డబ్బాల హుస్సేన్ రాఘవరెడ్డి నరసింహ చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు రాజబాబు, వెంకటరమణ, రైతు సంఘం మండల కార్యదర్శి పి రామ్మోహన్ ఎస్ ఏ కలాం ఎన్వి రమణ ఎస్ రహమతుల్లా రూల్స్ మద్దిలేటి కిట్టు వెంకట రాముడు వన్నూరు పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేడే వేడుకలు



**బేతంచేర్ల మనంన్యూస్ :**మండలపరిదిలో సిమెంట్ నగర్ గ్రామంలో ఏఐటీయూసీ నాయకులు లక్ష్మన్న అధ్యక్షతన మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఏఐటియుసి అరుణ పథకాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్ డి.దస్తగిరి లో హాజరై అనంతరం మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలోని హే మార్కెట్లో జరిగిన లక్షలాది కార్మికులు ఎనిమిది గంటల పని విధానం కావాలని నినదిస్తూ కార్మికులు పోరాటం చేపట్టారు ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో వందలాది కార్మికులు చనిపోయారు చనిపోయిన అమర కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రగుడ్డను కార్మికుల జెండా చిహ్నంగా ఏర్పాటుచేసుకొని ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకుంటున్నాము నాటినుండి నేటి వరకు కార్మికుల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు అందరూ సన్నద్ధం అవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఇమ్మా నియేల్ సామేలు ఖాశిం సెంట్రింగ్ రాజు పాల్గొన్నారు.

# అనాథ శవానికి అంత్యక్రియలు



**బేతంచేర్ల, మే 1(మనంన్యూస్):** ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ జమ్మలమడుగు నుంచి వచ్చి బేతంచెర్ల పంచాయతీ బోర్డు పక్క సందులో బాడుగకు ఉండి బజ్జీలు వేసుకుంటూ ఆలూరు రాజేశ్వరి వేద వతి జీవనం సాగించేవారు గత రాత్రి రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందడంతో వేదవతి వికలాంగురాలు కావడంతో రాజేశ్వరి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించమని ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వన్నూరు భాషా ను వేదవతి కోరినది వారు పోలీసు వారికి విషయం తెలిపి వారి సభ్య బృందంతో ఇందు స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జేబీవుల విక్రమ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు ఆహ్వానం



**కర్నూల్, మే 1(మనంన్యూస్):** ఉమ్మడి కర్నూలు జిల్లా కురవ సంఘం నాయకత్వన కురువ సామాజిక వర్గానికి చెందిన పదవ తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్ష ఫలితాలలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉమ్మడి కర్నూలు జిల్లా కురవ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు కురవ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కే పాపారాయుడు తెలిపారు. ఈ అకాడమిక్ సంవత్సరం(2024-2025) నందు పదవ తరగతి, ఇంటర్మీడియట్ రెండు సంవత్సరములపరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఉమ్మడి కర్నూలు జిల్లా కురవ సంఘం వారు ప్రతిభ పురస్కారాలకు ఆహ్వానం పలుకుతున్నట్లు వారు తెలిపారు. పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు 500కు పైగా, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 550 పైన, అలాగే ఇంటర్మీడియట్ రెండు సంవత్సరములు ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 850 మార్కులు ,ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 900 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతిభ పురస్కారాలకు అర్హులైన విద్యార్థులు తమ మార్కుల మెమోను, కులం సర్టిఫికెట్ను జిరాక్స్ కాపీని ఈనెల 5వ తేదీ లోపల 9440756199, 9032741194 ఈ వాట్సప్ నెంబర్లకు పంపగలరని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కురవ సంఘం నాయకత్వం లోఅర్హులైన విద్యార్థులకు అందరికీ ఆమోద యోగ్యమైన ఒక డేట్ ఫిక్స్ చేసి ఆ రోజున ప్రతిభ పురస్కారాలు సంఘం ఆధ్వర్యంలో అందజేస్తారని ఆయన తెలిపారు.

# ఘనంగా కార్మిక దినోత్సవం



**మహానంది,మే1,మనంన్యూస్ః** కార్మిక దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం మహానంది మండలంలోని పలు గ్రామాలలో ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు.గాజులపల్లి లో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కోటకొండ భాషా,బుక్కాపురం లో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు మిద్దె,రాజేశ్వరయ్య మహానంది మండల కార్యదర్శి ఆర్ సామేలు జిల్లా నాయకులు నరసింహ, మద్దిలేటి ఎర్ర జెండాను ఎగురవేసి,మేడే వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు నరసింహులు, మండల కార్యదర్శి ఆర్ , సామేలు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కార్మికవర్గం పండుగ మేడే విజయవంతంగా జరుగుతుందన్నారు. మేడేను స్ఫూర్తిగా తీసుకొని కార్మికులందరూ చైతన్యం కావాలన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను హరించి వేస్తుందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని మార్చి, మళ్లీ వెట్టి చాకిరీ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. కార్మికులందరూ ఏకమై సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎందరో అమరవీరులు త్యాగాలు చేసి 44 చట్టాలను దక్కించుకుంటే, 44 చట్టాలను ఈ బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాలను రద్దుచేసి, కార్మికుల పొట్ట కొట్టే విధంగా ప్రవర్తిస్తుందన్నారు.

# సీఎంను కలిసిన మాజీ జడ్పీ చైర్మన్



**తుగ్గలి, మే 1 (మనం న్యూస్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మాజీ జడ్పీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు విజయవాడలోనే సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పత్తికొండ నియోజకవర్గం పరిధిలోనే వివిధ సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు వినతి పత్రం అందజేసినట్లు మాజీ జెడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'నీకు అండగా నేనుంటా' అనే భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉపాధ్యక్షులు వెంకటపతి, టిడిపి నాయకులు అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# బన్నూరు గ్రామంలో పెన్షన్ల పంపిణీ



**జూపాడు బంగ్లా మే 1 (మనం న్యూస్) :** జూపాడుబంగ్లా మండలంలోని 80 బన్నూరు గ్రామంలో జరిగినటువంటి ఎన్టీఆర్ పెన్షన్ల పండుగలో భాగంగా నందికొట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గిత్త జయ సూర్య పాల్గొని ఇంటింటికి తిరిగి వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, ఎన్టీఆర్ పెన్షన్ కానుకలను ఒకటో తారీకున ఉదయం 7 గంటలకే సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్క అవ్వ తాతల కు అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్క అవ్వ తాతల, వికలాంగుల, వారిలో సంతోషాల విరిజల్లులు చూడడం ఎంతో ఆనందకరమని, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉన్నంతవరకు ప్రజల మొహాల్లో చిరునవ్వులతో కూడిన ఆనందం ఉంటుందని ఆయన తెలియజేశారు, పెన్షన్ల పంపిణీ అనంతరం 80 బన్నూరు గ్రామం నందులి ప్రజల మంచి నీటి అవసరతలకై 43 లక్షల 10వేల రూపాయలతో జల్ జీవన మిషన్ క్రింద మంచినీటి ట్యాంకును నిర్మించేందుకు భూమి పూజ చేసి పనిని ప్రారంభించడం జరిగినది.

# మే డే ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమిస్తాం



- **ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు**

**జూపాడు బంగ్లా మే 1 (మనం న్యూస్) :** దేశంలో నరేంద్ర మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల రక్షణకై మేడే స్ఫూర్తితో ఉద్యమిస్తామని , అమరవీరుల త్యాగాల రక్త తర్పణం తో ఏర్పడిన ఎర్రజెండా సాక్షిగా పోరాటం కొనసాగిస్తామని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, పిలుపునిచ్చారు.. గురువారం 135వ మే డే దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ మండల కార్యాలయం దగ్గర ఏఐటీయు సీ సీనియర్ నాయకులు శ్రీరాములు జండా ఆవిష్కరణ చేశారు.. .ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం రమేష్ బాబు మాట్లాడుతూ 1886 మే ఒకటో తేదీన ఎనిమిది గంటల పని విధానం కావాలని కోరుతూ అమెరికాలోని చికాగో నగరం ఏ మార్కెట్ దగ్గర వేలాదిమంది కార్మికులు పెద్ద ఎత్తున నిరసన చేస్తున్న తరుణంలో పారిశ్రామిక వేత్తలు,పాలక ప్రభుత్వాలు కక్ష సాధింపు ధోరణితో కార్మికులపై కాల్పులతో విరుచుకుపడి అనేకమంది ప్రాణాలు బలి తీసుకున్నారన్నారు.. కార్మికుల త్యాగాల రక్త తర్పణంతో ఏర్పడిన జెండా ఎర్రజెండా అనివారన్నారు.

# రాఘవ ట్రాఫిక్ కష్టాలు తీర్చవా

- **నడి రోడ్డుపైనే వాహనాల నిలుపుదల**
- **నరకయాతన పడుతున్న భక్తులు, పాదచారులు**

**మంత్రాలయం ,మే 1,మనం న్యూస్ :** సెలవులు వస్తుంటాయంటే చాలు భక్తులు, పాదచారులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుంటే కష్టాలు తీరుతాయని ఇక్కడ కు వచ్చే భక్తులకు ట్రాఫిక్ కష్టాలుతప్పడం లేదు. రాఘవ మాట్రాఫిక్ కష్టాలు తీర్చవా అంటు భక్తులు, పాదచారులు వేడుకుంటున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి ని దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుండి భక్తులు మంత్రాలయం కు వస్తుంటారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో వాహనాలలో వస్తుంటారు. రెండు రోజులు సెలవులు రావడం తో గురువారం అధిక సంఖ్యలో వాహనాలలో భక్తులు రావడం జరిగింది.దీంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వీరు ప్రైవేట్ వసతి గృహాల్లో కొందరు, మఠం వసతి గృహంలో కొందరు రూములు అద్దెకు తీసుకోవడం జరుగుతుంది. అయితే వసతి గృహాల్లో కారు పార్కింగ్ లేకపోవడంతో వాహనాలు నడిరోడ్డులో నిలుపుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని భక్తులు, పాదచారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నడవడానికి వీలు లేకుండా రాఘవేంద్ర సర్కిల్ నుండి పంచాయతీ కార్యాలయం వరకు ప్రధాన రహదారులపై వాహనాలు నిలపడంతో నడవడానికి ఇబ్బందులు పడుతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మంత్రాలయం ఎస్ఐ శివాంజుల్ తన సిబ్బంది తో రాఘవేంద్ర కూడలి , బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉండి ట్రాఫిక్ నియంత్రణ కొరకు తీవ్రంగా కృషి చేశారు. రాఘవేంద్ర సర్కిల్ నుండి రాఘవేంద్రస్వామి మఠానికి చేరుకోవాలంటే నరకయాతన అనుభవించే పరిస్థితి నెలకొందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, శ్రీ మఠం అధికారులు చొరవ తీసుకుని త్వరగా బైపాస్ రహదారిని ఏర్పాటు చేసి ఆ దారిలో పెద్ద పెద్ద వాహనాలు మళ్లిస్తే కొంతవరకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకొని ట్రాఫిక్ కష్టాలుతీర్చాలని భక్తులు, పాదచారులు కోరుతున్నారు.



# కార్మికులు కన్నెర్ర చేస్తే పాలక ప్రభుత్వాలు పతనం



**జూపాడుబంగ్లా మే 1 (మనం న్యూస్):** కార్మికులు కర్షకులు రైతులు కూలీలు కన్నెర్ర చేస్తే పాలక ప్రభుత్వాలు పతనం అయితాయని సిపిఎం మండల కన్వీనర్ ఎం కర్ణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. స్థానిక మండలంలోని సిఐటియు కార్యాలయం ఎదుట 139 వ మే డే కార్యక్రమానికి సిఐటియు మండల నాయకులు ఆకుల రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఎం కర్ణ ముఖ్య అతిథులుగా హాజరై ఆయన మాట్లాడుతూ. ప్రపంచం యావత్తు 139వ మే డే జరుపుకుంటున్నారని. ఆ రోజుల్లో బ్రిటిష్ పాలనలో కార్మికులు పోరాడి రక్తాన్ని చిందించి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈరోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయకుండా కాలరాస్తున్నాయని. కార్మికులు కర్షకులు కన్నెర్ర చేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పతనం అయితాయని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను దృష్టిలో ఉంచుకొని కార్మిక హక్కులు అమలు చేసేందుకు పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉద్యోగ కార్మికులకు భద్రత లేదు ఆ సంగీటితరంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం లేక తమ కుటుంబాలు సతమత మవుతున్నాయని రైతులకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అమలు చేయకపోవడంతో వలసలు వెళుతున్నారన్నారు.

# గడివేముల్లో మేడే వేడుకలు



**గడివేముల,మే 1(మనంన్యూస్):** మండల కేంద్రమైన గడివేముల్లో గురువారం నాడు సిఐటియు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 139 వ మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా నాయకులు నరసింహ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మికులతో కొత్త బస్టాండ్ సర్కిల్లో జెండాను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గడివేముల మండలంలో మే డేను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషమని అన్నారు అలాగే 8 గంటల పని కోసం కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఈ మేడేను ప్రతి ఒక్క కార్మికుడు పండగల జరుపుకోవాలని అన్నారు రాబోవు రోజుల్లో కార్మికులు కర్షకులు ఏకమై కార్మికుల సమస్యల కోసం పోరాటాలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలు తెస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

# ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన



**మహానంది,మే1,మనంన్యూస్:** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో వడగండ్ల వానతో కూడిన భారీ వర్షం పడింది. గురువారం సుమారు అరగంట పాటుగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వడగండ్లు కురిశాయి. ఒక్కసారిగా కురిసిన వాన బీభత్సంతో ప్రజలు భయంతో వణికిపోయారు. గ్రామంలో ఈదురుగాలులతో భారీగా కురిసిన వర్షానికి,రైతులకు చెందిన అరటి తోటలు నేలకూలాయి.కొత్తకోట్టాలలో సుధాకర్ కు చెందిన ఇంటి పై భారీ వృక్షం నెలకోరడంతో పెను ప్రమాదం తప్పింది. గాజులపల్లె మెట్ట ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు నుండి మురుగునీరు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## ప్రభుత్వ ఐటిఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**బేతంచేర్ల, మే1(మనం న్యూస్ ):** పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కోర్సు ఎలక్ట్రీషియన్ ఫీట్టర్ ఎలక్ట్రానిక్ మెకానిక్ కోప వెల్డర్ చేరడానికి దరఖాస్తు పదవ తరగతి పాస్ ఫెయిల్ అయిన విద్యార్థిని విద్యార్థులు మే 24వ తేదీ 5గ,, వరకు అప్లై చేసుకోవచ్చు అప్లై చేసుకోవడానికి వెబ్సైట్లో అప్లై చేసుకోవాలి అప్లై చేసుకున్న విద్యార్థులు పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ మే 24వ తేదీ నుండి 26వ తేదీ సాయంత్రం ఐదు గం,, వరకు వుంటుంది విద్యార్థులు వెరిఫికేషన్ చేయించుకోవాలి వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు డోన్ లో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో జరుగు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని క్వాలిఫై అయిన విద్యార్థులకు కాల్ లెటర్ ఇంటికి పంపుతారని ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు.

## పండుగలా పింఛన్ల పంపిణీ

**మహానంది, మే1,మనంన్యూస్:** మహానంది మండలం లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మండల పరిషత్ డెవలప్ మెంట్ అధికారి మహమ్మద్ దౌల, ఈఓఆర్డీ నాగేంద్ర ల ఆధ్వర్యంలో మహానంది మండలంలో వికలాంగులకు, వృద్దలకు,వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లను అందజేశారు.

## ఏఎస్ఐ గా బాధ్యతల స్వీకరణ

**జూపాడుబంగ్లా మే 1 (మనం న్యూస్) :** జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ నందు ఏ ఎస్ ఐ గా బాధ్యతలు చేపట్టిన వి సంజీవుడు, ఈయన ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు ఏఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ కు ఏఎస్ఐగా వచ్చారని తెలియజేశారు.







# IPL-2025



# అత్యుత్తమంగా బౌలింగ్ చేయడానికి ప్రయత్నించా : చాహల్

ఐపీఎల్ 2025 సీజన్ లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్లో పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. చాహల్ హ్యాట్రిక్ సాధించి ఈ విజయంలో ప్రముఖ పాత్ర పోషించాడు. బౌలింగ్లో తాను రాణించడానికి కారణం ఏంటో అతడు వివరించాడు. పేస్ బౌలర్లు సంధించిన స్లో బంతులను గమనించిన తర్వాత తన లైన్లో మార్పులు చేసుకున్నట్లు అతడు తెలిపాడు. ఈ మ్యాచ్లో 19వ ఓవర్లో రెండో బంతికి చాహల్ మొదట ఎంఎస్ ధోనీని (11) పెవిలియన్ బాట పట్టించాడు. తర్వాత నాలుగో బంతికి దీపక్ హుడా (2), అయిదో బంతికి అన్షుల్ కాంబోజ్ (0), ఆరో బంతికి నూర్ అహ్మద్ (0)ను ఔట్ చేసి హ్యాట్రిక్ సాధించాడు. ఈ సీజన్లో ఏ బౌలర్కైనా ఇదే తొలి హ్యాట్రిక్. మొత్తంగా చాహల్కిది రెండోది కావడం విశేషం.

'పేసర్లు తమ కోటా పూర్తి చేసుకున్న తర్వాత నాకు 19 లేదా 20వ ఓవర్ బౌలింగ్ చేయడానికి అవకాశం వస్తుందని భావించా. దానికి అనుగుణంగా నన్ను నేను సిద్ధం చేసుకున్నా. పేసర్లు వేసిన స్లో బంతులను గమనించా. అవి పిచ్ను తాకిన తర్వాత బ్యాట్ మీదకు సరిగా రావడం లేదు. నెమ్మదిగా ఆగి వస్తున్నాయి. ఆ బంతులను పరిశీలించిన తర్వాత నేను ఏ లైన్లో బౌలింగ్ చేయాలో ఓ అంచనాకు వచ్చా. ముందైతే నేను హ్యాట్రిక్ గురించి ఆలోచించలేదు. బౌలింగ్లో నా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించా' అని చాహల్ మ్యాచ్ అనంతరం తన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్తో ఐపీఎల్ వెబ్సైట్లో పోస్ట్ చేసిన ఓ వీడియోలో మాట్లాడాడు.

'క్రీజులో మహీభాయ్ ఉన్నాడని నాకు తెలుసు. మరో ఎండ్లో శివమ్ దూబే ఉన్నాడు. నేను ఎలా అయినా సరే.. నా ఓవర్లో వికెట్ సాధించాలని అనుకున్నా. వాళ్లు నా బౌలింగ్లో సిక్సు కొడతారా అని ఆలోచించలేదు. నేను అత్యుత్తమంగా బౌలింగ్ చేయాలని మాత్రమే చూశా' అని వివరించాడు.

# పంజాబ్ కింగ్స్‌తో సామ్ కరన్ వివాదం!

ఐపీఎల్ 2025 సీజన్ లో భాగంగా బుధవారం పంజాబ్కింగ్స్, చెన్నై సూపర్కింగ్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్ సందర్భంగా చెన్నై ఆటగాడు సామ్ కరన్ వ్యవహరించిన తీరు నెట్టింట చర్చకు దారితీసింది. గతంలో పంజాబ్ యాజమాన్యంతో అతడికి వివాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు మొదలయ్యాయి.

చెన్నై ఇన్నింగ్స్ 18వ ఓవర్లో సామ్ కరన్ ఔటైన తర్వాత పెవిలియన్ కు వెళ్లాడు. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ డగౌట్ వైపు చూస్తూ ఏవో సంజ్ఞలు చేశాడు. ఈ దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. దీంతో కరన్కు ఆ జట్టుతో ఏదో వివాదం ఉందనే వాదన వినిపిస్తోంది. గతంలో అతడు పంజాబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సీజన్కు ముందు అతడిని కింగ్స్ వదులుకోవడంతో వేలంలో చెన్నై దక్కించుకుంది. ఈ మ్యాచ్లో కరన్ 47 బంతుల్లోనే 88 పరుగులు చేశాడు. ఈ సీజన్లో అతడికి ఇదే తొలి హాఫ్ సెంచరీ. ఇప్పటివరకు కేవలం నాలుగు మ్యాచుల్లో మాత్రమే ఆడాడు. నిన్నటి మ్యాచ్లో 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న చెన్నైను కరన్ తన ఇన్నింగ్స్తో ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే బ్రెవిస్తో కలిసి 78 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే, అతడి పోరాటం వృథా అయ్యింది. పంజాబ్ చేతిలో చెన్నై ఓటమి పాలైంది. ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా ప్లేఆఫ్స్ రేస్ నుంచి నిష్క్రమించినట్లైంది.

# ఆ విషయాల్లో.. అమితాబ్, కమల్ హాసన్ నాకు స్ఫూర్తి: చిరంజీవి

తనలో స్ఫూర్తినింపిన భారతీయ సినీ నటులపై ప్రముఖ నటుడు చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఒక్కో విషయంలో ఒక్కొక్కరు ఇన్స్పైర్ చేశారని తెలిపారు. ముంబయి వేదికగా జరిగిన 'వేవ్స్' లో ఆయన మాట్లాడారు. తన సినీ ప్రయాణాన్నీ గుర్తుచేసుకున్నారు.''బాల్యంలో నేను డ్యాన్స్ చేసి కుటుంబం, స్నేహితులను అలరించేవాడిని. అలా నటనపై మొదలైన ఆసక్తి నన్ను చెన్నై వెళ్లేలా చేసింది. నేను అడుగుపెట్టే సమయానికి ఇండస్ట్రీలో ఎంతోమంది లెజండరీ యాక్టర్స్ ఉన్నారు. ' ఇప్పటికే పలువురు సూపర్స్టార్స్ ఉన్నారు కదా. ఇంకా అదనంగా నేనేం చేయగలను?అని అనుకునేవాడిని. ఎలాగైనా అందరి దృష్టిని ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నా. 1977లో నటనలో శిక్షణ పొందా. మేకప్ లేకుండా సహజంగా నటించాలని మిథున్ చక్రవర్తి నుంచి నేర్చుకున్నా. స్టంట్స్ విషయంలో అమితాబ్ బచ్చన్, డ్యాన్స్ విషయంలో నా సీనియర్ కమల్ హాసన్ నాకు స్ఫూర్తిగా నిలిచారు. వారి సినిమాలు చూస్తూ, నటన పరిశీలిస్తూ నన్ను నేను మలుచుకున్నా'' అని పేర్కొన్నారు.



అంతర్జాతీయ స్థాయిలో భారత్ను గ్లోబల్ ఎంటర్టైన్మెంట్ హబ్గా మార్చాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం 'వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్' (వేవ్స్). గురువారం అట్టహాసంగా ప్రారంభమైన ఈ వేడుక నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. వేవ్స్ అడ్వైజరీ బోర్డులో చిరంజీవి తదితరులు సభ్యులుగా ఉన్న సంగతి తెలిసిందే. రజనీకాంత్, మోహన్లాల్, అక్షయ్కుమార్, ఆమిర్ఖాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 4100లో జాతీయ రికార్డు



ఇండియా ఓపెన్ రిలే పోటీల్లో గుర్విందర్ సింగ్, అనిమేశ్, మణికంఠ, అవల్లాన్ల కూడిన పురుషుల జట్టు 4స100 రిలేలో జాతీయ రికార్డును సృష్టించింది. 38.69 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసిన ఈ చతుష్టయం.. 15 ఏళ్ల జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. 2010 కామన్వెల్త్ క్రీడల సందర్భంగా రెహమతుల్లా, సురేశ్, షమీర్, ఖురేషీలతో కూడిన జట్టు రికార్డు (38.89) నెలకొల్పింది. మహిళల 4స100 మీటర్ల విభాగంలో తెలుగమ్మాయి, 'లక్ష్య' అథ్లెట్ నిత్య గంధె, శర్వాణి, అభినయ, స్నేహలతో కూడిన బృందం విజేతగా నిలిచింది. 44.12 సెకన్లలో రేసు పూర్తి చేసింది. ఈ జట్టు ఎన్సీఓఈ త్రివేండ్రంకు ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్లో నిత్య రెండు స్వర్ణాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

# గాయంతో ఐపీఎల్ కు మ్యాక్స్ వెల్ దూరం

పంజాబ్ కింగ్స్కు ఓ చేదువార్త. ఆస్ట్రేలియన్ ఆల్ రౌండరైన గ్లెన్ మ్యాక్స్ వెల్ ఐపీఎల్ కు దూరమయ్యాడు. చేతి వేలు విరిగిన కారణంగా అతడు ఐపీఎల్ లో మిగతా మ్యాచ్ లు ఆడలేడు. కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మునుపటి మ్యాచ్ లో మాక్స్ వెల్ ఇబ్బంది పడ్డాడు. ప్రాక్టీస్ సెషన్ లో గాయం కావడమే దీనికి కారణం. ఆ మ్యాచ్ లో అతడు కేవలం 7 పరుగులకే ఔటయ్యాడు. ఈ సీజన్ లో మ్యాక్స్ వెల్ పెద్దగా ఫామ్ లో కూడా లేడు. చెన్నై సూపర్ కింగ్స్తో మంగళవారం జరిగిన మ్యాచ్ లో అతడి స్థానంలో సూర్యాన్ష్ షెడ్జ్ వచ్చాడు. ఈ పోరులో పంజాబ్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. 'దురదృష్టవశాత్తు, మాక్స్ వెల్ వేలు విరిగింది. ముందు అది చిన్న గాయమే అనుకున్నాం. తర్వాత అది పెద్ద సమస్యే అని తెలిసింది. స్కానింగ్ లో వేలు విరిగినట్లు తేలింది' అని మార్కస్ స్టొయినిస్ అన్నాడు. మ్యాక్స్ వెల్ స్థానాన్ని భర్తీ చేసేందుకు సరైన ఎంపిక కోసం చూస్తున్నామని పంజాబ్ కింగ్స్ హెడ్కోచ్ రికీ పాంటింగ్ వివరించాడు.



# పూజాహెగ్డే యాక్టింగ్‌పై కామెంట్స్..

సూర్య, పూజాహెగ్డే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజు దర్శకుడు. గురువారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే కార్తిక్ సుబ్బరాజు, చిత్ర సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అభిమానులతో కలిసి సినిమా వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా ఓ విలేకరి.. ''పూజాహెగ్డే యాక్ట్ చేస్తే ఆ సినిమా ఫ్లాప్ అవుతుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానిపై మీ అభిప్రాయం ఏమిటి?'' అని ప్రశ్నించాడు. దీనిపై సంతోష్ నారాయణన్ స్పందిస్తూ.. అది కేవలం వారి ఊహ మాత్రమేనని అందులో ఎలాంటి నిజం లేదని అన్నారు. తమ చిత్రానికి వస్తోన్న రెస్పాన్స్ చూస్తుంటే సంతోషంగా ఉందని కార్తీక్ సుబ్బరాజు తెలిపారు. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. తమ చిత్రానికి సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం ఒక బలమైందని పేర్కొన్నారు.

దర్శకుడిగా కార్తిక్ సుబ్బరాజుకు కోలీవుడ్లో మంచి పేరు ఉంది. 'పిజ్జా', 'జిగర్తాండ', 'పేట' వంటి చిత్రాలను ఆయన తెరకెక్కించారు. తొలిసారి ఆయన సూర్యతో కలిసి వర్క్ చేసిన చిత్రమే 'రెట్రో'. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఇది సిద్ధమైంది. లవ్.. లాఫ్టర్.. వార్.. ధర్మం.. వంటి విభాగాల్లో ఈ కథను ప్రేక్షకులకు అందించారు. ఇందులో పూజాహెగ్డే రుక్మిణి పాత్రలో నటించారు. అయితే ఈ సినిమాలో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె తాజాగా ఇన్స్టాలో పోస్ట్ పెట్టారు. ఈ పాత్రలో భాగం కావడాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకున్నానని అన్నారు. 'మూగముడి' అనే కోలీవుడ్ చిత్రంతో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చారు పూజాహెగ్డే. సుమారు 13 ఏళ్ల కెరీర్లో దక్షిణాదితోపాటు హిందీ చిత్రాల్లోనూ ఆమె యాక్ట్ చేశారు. కెరీర్ ఆరంభించింది తమిళంలోనే అయినప్పటికీ ఇప్పటివరకూ అక్కడ ఆమె చేసింది మూడు చిత్రాలు మాత్రమే. 2022లో విడుదలైన 'బీస్ట్'పై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ చివరకు నిరాశే మిగిలింది. మరోవైపు, ఇటీవల ఆమె నటించిన చిత్రాలు వరుస పరాజయాలు అందుకున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో 'కూలీ' (స్పెషల్ సాంగ్ అని టాక్), 'జన నాయగన్', 'కాంచన 4' వంటి తమిళ చిత్రాలు ఉన్నాయి.

# 'కింగ్డమ్'లో విజయ్-భాగ్యశ్రీ రొమాన్స్..

టాలీవుడ్ లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్డమ్' కూడా ఒకటి. ఈ సినిమాను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేయగా ఈ సినిమాను భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్ 'హృదయం లోపల' ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు.

పూర్తి రొమాంటిక్ సాంగ్ గా ఈ పాట రాబోతున్నట్లు ఈ ప్రోమో చూస్తే అర్థమవుతోంది. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బొర్సె ముద్దులతో రెచ్చిపోబోతున్నట్లు ఈ ప్రోమోలో హింట్ ఇచ్చారు. ఇక అనిరుధ్ రవిచందర్ మరోసారి తన మ్యూజిక్ తో మ్యాజిక్ చేయనున్నాడు. 'హృదయం లోపల' సాంగ్ ప్రోమోను ఆయన పాడిన తీరు ఆకట్టుకుంటుంది.

ఈ ఫస్ట్ సింగిల్ సాంగ్ను మే 2న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో విజయ్-భాగ్యశ్రీల రొమాన్స్ ఏ రేంజ్ లో ఉండబోతుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. మరి వీరి రొమాన్స్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ఫైర్ క్రియేట్ చేస్తుందో చూడాలి. ఈ సినిమాను సితార ఎంటర్ టైన్మెంట్స్, ఫార్చున్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు ప్రొడ్యూస్ చేస్తున్నాయి. మే 30న 'కింగ్డమ్'ను గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



# ఇలాంటి రోజు వస్తుందని ముందే భయపడ్డా: తాప్సీ



సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ మిషా అగర్వాల్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆన్ లైన్ లో తనని అనుసరించే వారి సంఖ్య తగ్గిందనే కారణంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని మిషా కుటుంబసభ్యులు వెల్లడించారు. దీంతో మిషా మృతి వార్త అంతటా తీవ్ర చర్చకు దారితీసింది. దీనిని ఉద్దేశించి బాలీవుడ్ నటి తాప్సీ పన్ను స్పందించారు. ఇలాంటి ఒక రోజు వస్తుందని తాను ముందే భయపడ్డానని అన్నారు. ''ప్రస్తుతం సోషల్మీడియాపై ప్రతిఒక్కరికి ఉన్న వ్యామోహం చూసి ఇలాంటి రోజు వస్తుందని నేను ఎప్పుడో భయపడ్డా. జీవితాన్ని మనం ప్రేమించడం కంటే ఫాలోవర్స్ సంఖ్యకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తామని.. చుట్టూ ఉన్నవారు చూపించే నిజమైన ప్రేమ కంటే ఆన్లైన్ ప్రేమకే మొగ్గు చూపుతామని భయపడ్డా. అదేవిధంగా మనం కష్టపడి ఎన్నో ఏళ్లపాటు చదువుకున్న డిగ్రీలను లైకులు, కామెంట్స్ అధిగమిస్తాయని ఊహించా. ఈరోజు ఇలాంటి ఘటనను చూడటం నిజంగా బాధాకరం. నా హృదయం ముక్కలైంది'' అని తాప్సీ పోస్ట్ పెట్టారు. మిషా అగర్వాల్ (24) ఏప్రిల్ 24న మృతి చెందింది. ఆమె మరణ వార్తను ఇన్స్టా వేదికగా కుటుంబసభ్యులు వెల్లడించారు. 'లా' చదువుకున్న ఆమె కెరీర్లో స్థిరపడాలని ఎన్నో కలలు కందని చెప్పారు. ''లాయర్ కావాలనుకున్న మిషా.. ఒక దశలో ఇన్స్టాగ్రా ఆసక్తి పెంచుకుంది. రీల్స్, పోస్టులతో ఫాలోవర్స్ను సొంతం చేసుకుంది. ఫాలోవర్స్ సంఖ్యను ఒక మిలియన్కు చేర్చుకోవాలని కలల కంది. ఇటీవల కాలంలో తన ఫాలోవర్స్ క్రమంగా తగ్గుతూ వచ్చారు. ఆ విషయాన్ని తాను జీర్ణించుకోలేకపోయింది. కెరీర్ పరంగా దృష్టిసారించలేకపోయింది. ఆ భయంతోనే ఆత్మహత్య చేసుకుంది'' అని కుటుంబసభ్యులు ప్రకటన విడుదల చేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.